

విశాఖ నుంచి బ్యాంకాక్ విమానం ప్రారంభం



విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి బ్యాంకాక్ వెళ్లేందుకు కొత్త విమాన సర్వీసు మంగళవారం అందుబాటులోకి వచ్చింది. ఉత్తరాంధ్ర ప్రజలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ ప్రజలకు కూడా ఇది ఉపయోగపడుతుంది. ఎయిర్ ఆసియా సంస్థ వారానికి మూడు రోజుల ఈ సర్వీసును నడపనున్నది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న విమాన సంఘం ప్రతినిధులు ... మిగతా 6వ పేజీలో

ఉక్కులో వీఆర్ఎస్

2,500 మందిని తగ్గించాలని ప్రణాళిక

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి భారీ ప్రణాళిక సిద్ధమవుతోంది. అప్పులు అధికంగా ఉన్నాయని, ముడి పదార్థాల కొరత ఉందని ఆర్థిక సాయం చేయాల్సిందిగా కోరితే నిరాకరించిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకాని(వీఆర్ఎస్)కి మాత్రం నిధులు ఇస్తామని(బడ్జెట్ సపోర్టు) ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులలో 2,500 మందిని తీసేస్తే వారికి పరిహారంగా ఇవ్వడానికి రూ.1,445 కోట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. అయితే, వీఆర్ఎస్ ప్రక్రియ అంతా ఏడాదిలోనే పూర్తి చేయాలని షరతు పెట్టడం గమనార్హం.

ప్రస్తుతం విశాఖ ఉక్కులోని అన్ని విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. ఐదుగురు పనిచేయాల్సిన చోట ముగ్గురే చేస్తున్నారు. పని ఒత్తిడి అధికంగా ఉంది. నాలుగేళ్ల నుంచి కొత్త నియామకాలు ఆపేశారు. మరోవైపు ఏడాదికి 700 నుంచి 800 మంది పదవీ విరమణ చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం(2024-25)లో ఇంకో వెయ్యి మంది రిటైర్ కానున్నారు. 2027 చివరికి 4 వేల మంది రిటైర్‌మెంట్ పేరుతో బయటకు వెళ్లిపోతారు. ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు కలిపి 14 వేల మంది ఉన్నారు. 2027 నాటికి వారి సంఖ్య 10 వేలకు పడిపోతుంది. విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని అస్మదీయులైన కార్పొరేట్లకు అప్పగించేటపుడు వారిపై జీతాల భారం అధికంగా ఉండకూడదని



ఉక్కు పరిపాలనా భవనం

రిక్రూట్‌మెంట్ పూర్తిగా ఆపేశారు. ఉన్నవారిని కూడా పంపించేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. నిలదొక్కుకోవడానికి సాయం అడిగితే స్పందించని కేంద్ర ప్రభుత్వం వీఆర్ఎస్‌కు మాత్రం రూ.1,445 కోట్లు ఇవ్వడానికి ముందుకు రావడంపై కార్మిక వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలో ఇలా ఆర్థిక సంక్షోభం వచ్చినప్పుడు ప్రధాని పీవీ నరసింహరావు రూ.1,200 కోట్లు, ఆ తరువాత వాజపేయి మరో రూ1,400 కోట్లు సాయం చేశారు. ఆనాటి అప్పులను రద్దు చేసి వాటాను మూలధనంగా మార్చారు. దీనివల్ల స్టీల్‌ప్లాంటు మళ్లీ

అన్ని విభాగాల్లో ఇప్పటికే సిబ్బంది కొరత

- స్వచ్ఛందంగా ఉద్యోగాలు వదిలేసేవారికి వెంటనే సొమ్ములు ఇచ్చేందుకు సిద్ధం
- రూ.1,445 కోట్లు ఇస్తామని కేంద్రం ప్రకటన

లాభాల బాటలోకి వచ్చి సొంత నిధులతో రెట్టింపు ఉత్పత్తి సామర్థ్యం సాధించింది.

వీఆర్ఎస్ తీసుకునేలా..

విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి ఎలాగోలా బయటపడితే చాలనే అభిప్రాయం ఉద్యోగుల్లో బలంగా వినిపిస్తోంది. గత కొద్ది నెలలుగా జీతాలు కూడా సకాలంలో ఇవ్వలేకపోతున్నారు. ఈ నెల 50 శాతం జీతం సోమవారం ఇచ్చారు. భవిష్యత్తులో ఇంకెలాంటి పరిస్థితులు ఉంటాయో తెలియవని హెచ్చరిస్తున్నారు. ఇక్కడ ఉద్యోగులకు 15 ఏళ్ల నుంచి పే రివిజన్ లేదు. తక్కువ జీతాలకే పనిచేస్తున్నారు. పదోన్నతులు లేవు. 30-40 ఏళ్ల వయసున్న ఉద్యోగులు ఇక్కడుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని భావించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గత రెండేళ్లలో 500 మంది రాజీనామా చేసి ఇతర సంస్థలకు వెళ్లిపోయారు. పదవీ విరమణకు చేరువైన వారు మాత్రం యాజమాన్యం జీతాలు ఇవ్వలేకపోతున్నది కాబట్టి.. కేంద్రం ఇచ్చే వీఆర్ఎస్ ప్యాకేజీ తీసుకొని వెళ్లిపోవడమే మంచిదని ఆలోచిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా విడుదల

- ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ, ఐదు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఖరారు
- విశాఖ ఎంపీ స్థానానికి పులుసు సత్యనారాయణరెడ్డి

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల రెండో జాబితాను కాంగ్రెస్ పార్టీ మంగళవారం రాత్రి విడుదల చేసింది. ఈ జాబితాలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన రెండు లోక్‌సభ, ఐదు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. విశాఖపట్నం లోక్‌సభ స్థానానికి పులుసు సత్యనారాయణరెడ్డి, అనకాపల్లి లోక్‌సభ స్థానానికి వేగి వెంకటేష్ అభ్యర్థిత్వాలను పార్టీ ఖరారు చేసింది. అలాగే, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గానికి అడ్డాల వెంకట వర్మరాజు, విశాఖపట్నం సౌత్ నుంచి వాసుపల్లి సంతోష్, గాజువాక నుంచి లక్కరాజు రామారావు, అరకులోయ నియోజకవర్గం నుంచి శెట్టి గంగాధరస్వామి, నర్సీపట్నం నుంచి రుత్తల శ్రీరామ్మూర్తి అభ్యర్థిత్వాలను పార్టీ ఖరారు చేసింది. రెండు దశల్లో రెండు పార్లమెంట్, 11 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. మరో లోక్‌సభ (అరకులోయ) స్థానంతో పాటు నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇంకా అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

వలంటీర్లకు వైసీపీ వల

- గాజువాక నియోజకవర్గంలో రూ.10 వేలు చొప్పున పంపిణీ?
- ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాల్సిందిగా నేతల ఆదేశం
- వారి ద్వారా ఓటర్లకు డబ్బు పంపిణీకి సన్నాహాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 9: గాజువాక నియోజకవర్గంలో ఒక్కొక్క వలంటీర్‌కు వైసీపీ నేతలు రూ.10 వేలు చొప్పున పంచుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రతి వలంటీర్‌ను ముఖ్య నేత ఇంటికి పిలిపించుకుని డబ్బులు ఇస్తున్నట్టు చెబుతున్నారు. వలంటీర్లు తమ పరిధిలోని 50 ఇళ్లలో గల ఓటర్లు వైసీపీకి ఓటు వేసేలా చూడాలని, అలా చేస్తే మరో పది వేల రూపాయలు కూడా ఇస్తామని ఆశ చూపినట్టు సమాచారం. దాంతోపాటు ఎన్నికలప్పుడు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసే బాధ్యతను కూడా అప్పగిస్తామని చెప్పినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నేతల వద్ద డబ్బులు తీసుకున్న కొందరు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వైసీపీకి ఓటెయ్యాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. మళ్లీ జగన్ సీఎం అయితేనే పథకాలు కొనసాగుతాయని చెబుతున్నారు. ఇదిలావుండగా వలంటీర్లకు డబ్బులు పంపిణీతో బాటు వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించే బాధ్యతను కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జులకు అప్పగించినట్టు ప్రచారం జరుగుతోంది.

ఐపీఎల్‌లో లోకల్ బాయ్ నితీష్ మెరుపులు



- సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం
- పంజాబ్ కింగ్స్ బౌలర్లపై సిక్సర్లు, బౌండరీలతో మెరుపుదాడి

- వార్త 6వ పేజీలో


రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	6.16

నెరవేరని సొంతింటి కల

టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

- గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణానికి 2,03,438 మంది అర్హులు గుర్తింపు
- 43,844 మంది డీడీలు సమర్పణ
- 55 వేల ఇళ్ల నిర్మాణానికి నగరం, చుట్టుపక్కల భూ సేకరణ
- 24,192 ఇళ్ల నిర్మాణం ప్రారంభం
- ఎన్నికల ముందు 4,000 ఇళ్లు లబ్ధిదారులకు కేటాయింపు
- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రద్దు
- డీడీలు సమర్పించిన వారిలో 30,083 మంది మాత్రమే అర్హులంటూ వాదన
- ఐదేళ్లలో ఇళ్ల పనుల్లో పురోగతి శూన్యం
- అదిగో...ఇదిగో అంటూ లబ్ధిదారులకు ఆశలు
- ఏడెనిమిది నెలల క్రితం 7,456 ఇళ్లు అప్పగింత
- అందులో సగానికిపైగా గత ప్రభుత్వంలో నిర్మించినవే...
- మిగిలిన లేఅవుట్లలో ఎక్కడి పనులు అక్కడే



బక్కన్నపాలెంలో అసంపూర్తిగా ఇళ్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 24,192 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించగా...వైసీపీ కేవలం 7,456 ఇళ్లను (అవి కూడా గత ప్రభుత్వ హయాంలోనే దాదాపు పూర్తయ్యాయి) మాత్రమే లబ్ధిదారులకు అప్పగించింది. అయితే అక్కడ కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించకపోవడంతో ఖాళీగానే ఉండిపోయాయి.

మొత్తం లేఅవుట్‌లు	31
నిర్మాణం ప్రారంభించిన ఇళ్లు	24,192
ఇప్పటివరకూ లబ్ధిదారులకు అందజేసినవి	7,456
లబ్ధిదారులు దిగిన ఇళ్లు	4వేలు లోపే

పట్టణ ప్రాంతాల్లో పేదలకు పక్కా ఇళ్లను అందజేసేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వం టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) పథకానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకానికి నోడల్ సంస్థగా టిడ్కో కార్యకలాపాలు సాగిస్తోంది. టిడ్కో ఇళ్ల కోసం జీవీఎంసీకి 3,47,284 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించిన తర్వాత 2,03,438 మందిని అర్హులుగా గుర్తించారు. అందులో ఇళ్లు నిర్మించుకునేందుకు సొంతంగా స్థలాలు కలిగి ఉన్న 8,262 మందికి బీఎల్‌సీ (లబ్ధిదారుడే నిర్మాణం చేసుకోవడం) కింద పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేయాలని నిర్ణయించారు. స్థలాలు లేనివారికి ప్రభుత్వమే 300, 365, 430 చదరపు అడుగుల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది. 300 చదరపు అడుగులు కోసం రూ.25 వేలు, 365 చదరపు అడుగుల ఇంటి కోసం రూ.50 వేలు, 430 చదరపు అడుగుల రూ.లక్ష చొప్పున డీడీలు తీయాలని ప్రభుత్వం ఆదేశించగా, 43,844 మంది డీడీలు తీసి జీవీఎంసీకి అందజేశారు. టిడ్కో కింద జీవీఎంసీ పరిధిలో 55 వేల ఇళ్ల నిర్మాణానికి సంగివలస, బక్కన్నపాలెం, కొమ్మాది, దబ్బంద, అచ్చింనాయుడులోవ, ములగాడ, ట్రై జంక్షన్, దువ్వాడ, భానోజీతోట,



చీమలాపల్లిలో పునాదుల్లోనే నిర్మాణాలు

ఐదేళ్లుగా నిరీక్షిస్తున్నా..



టిడ్కో ఇంటి కోసం 2019లో రూ.25 వేలు డీడీ కట్టాను. ఇటీవల మరొక రూ.25 వేలు చెల్లించాను. నాకు పద్మనాభ నగర్‌లో ఇల్లు మంజూరుచేశారు. అయితే మొత్తం సొమ్ము చెల్లిస్తేనే ఇల్లు అప్పగిస్తామని చెప్పడంతో బ్యాంకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నా. ఎన్నికల కారణంగా రుణం మంజూరు కాలేదు. రుణం మంజూరుకాలేదని ఇల్లు ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో, అసలు ఇస్తారో, లేదో కూడా తెలియడం లేదు. ఐదేళ్లుగా నిరీక్షిస్తున్నా ఇల్లు రాకపోవడం బాధాకరం.

- పండా ప్రసన్నలక్ష్మి, గోపాలపట్నం,

అగనంపూడి, బర్మా కాలనీ, తలారివానిపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి, కొండకొప్పాక, సిరసపురం, సత్యనారాయణపురం, రాతిచెరువు, చినముషిడివాడ, చీమలాపల్లి, పరవాడ, ... మిగతా 6వ పేజీలో

వైసీపీకి షాక్

- బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌తో పాటు టీడీపీలో చేరిన ఇద్దరు కార్పొరేటర్లు
- అదేబాటలో మరో ఐదుగురు కార్పొరేటర్లు



సీతంరాజు సుధాకర్‌కు పార్టీ కండువా వేస్తున్న చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఇద్దరు కార్పొరేటర్లు షాక్ ఇచ్చారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ తోపాటు మంగళవారం విజయవాడలో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరిపోయారు. వైసీపీకి చెందిన మరో ఐదుగురు కార్పొరేటర్లు కూడా సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా త్వరలో టీడీపీలో చేరే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతోంది.

వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగిన సీతంరాజు సుధాకర్ దక్షిణ నియోజకవర్గం టికెట్ ఆశించారు. గత నాలుగేళ్లుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. అయితే టీడీపీ తరఫున గెలిచి తమ పార్టీలో చేరిన సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కే వైసీపీ అధిష్ఠానం టికెట్ ఖరారు చేసింది. దీంతో సుధాకర్ కొంత కాలం కిందట వైసీపీకి రాజీనామా చేశారు. ఆయనతో పాటు వైసీపీకి చెందిన ఏడుగురు కార్పొరేటర్లు పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. అసమ్మతి కార్పొరేటర్లను వైసీపీ నేతలు పిలిచి బుజ్జగించడంతో వారంతా సందిగ్ధంలో పడ్డారు. తాజాగా మంగళవారం సీతంరాజు సుధాకర్ విజయవాడ వెళ్లి చంద్రబాబునాయుడును కలిసి టీడీపీ ... మిగతా 6వ పేజీలో

వైసీపీకి భీమిలి ఎంపీపీ రాజీనామా

- మండలాధ్యక్ష పదవికి కూడా...



వెంకటసూర్యనారాయణరాజు

భీమునిపట్నం (రూరల్) ఏప్రిల్ 9: భీమిలి మండలాధ్యక్షులు డి.వెంకటసూర్యనారాయణరాజు తన పదవికి, వైసీపీ ప్రాథమికసభ్యత్వానికి రాజీనామా చేశారు. మండలంలోని అమనాంలో గల తన ఇంటి వద్ద మంగళవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఈ ప్రకటన చేశారు. తనను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అనేకసార్లు అవమానాలకు గురిచేశారని ఆరోపించారు. సర్పంచులతో తాను మాట్లాడుతుంటే ఆయన తట్టుకోలేకపోయేవారన్నారు. అమనాం సర్పంచ్‌గా ఉన్న తన తల్లి సూర్యనారాయణమ్మ కూడా పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. తనతో పాటు మరికొందరు కూడా పార్టీని వీడుతున్నారన్నారు

బ్లాక్‌లో మద్యం విక్రయాలు



- ప్రభుత్వ దుకాణాలు కేంద్రంగా దందా
- ఎన్నికల నేపథ్యంలో విక్రయాలపై సీలింగ్
- నిర్దేశించిన మొత్తం సాయంత్రం ఆరు గంటలకల్లా అమ్ముడైపోతున్న వైనం
- బాటిల్‌పై రూ.100 వరకూ అదనంగా వసూలు
- మధ్యాహ్నమే సరకు సైడ్ చేస్తున్నారనే ఆరోపణలు
- ఆ తర్వాత వచ్చేవారికి బెల్ట్ వ్యాపారుల ఫోన్ నంబర్ ఇస్తున్న సిబ్బంది

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మద్యం విక్రయాల్లో బ్లాక్‌లో సాగుతున్నాయి. ఎన్నికల నేపథ్యంలో దుకాణాల్లో అమ్మకాలపై ప్రభుత్వం సీలింగ్ విధించింది. నిర్దేశించిన సరకు సాయంత్రం ఐదు, ఆరు గంటలకే అమ్ముడైపోతోంది. ఆ తర్వాత వచ్చే మందుబాబులు దుకాణాల్లో మద్యం లేకపోవడంతో బెల్ట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే కొంతమంది సిబ్బందే బెల్ట్ వ్యాపారుల ఫోన్ నంబర్ ఇచ్చి వారి వద్ద కొనుక్కోవాలని చెబుతున్నారు.

జిల్లాలో 139 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటికి ఎక్సైజ్ శాఖ అధికారులే డిపోల నుంచి సరకు సరఫరా చేస్తుంటారు. దుకాణంలో జరిగిన విక్రయాలకు సంబంధించిన మొత్తాన్ని ఏరోజుకారోజు బ్యాంకులో డిపాజిట్ చేస్తుంటారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో మద్యం పక్కదారి పట్టే అవకాశం ఉందనే భావనతో విక్రయాలపై ప్రభుత్వం సీలింగ్ విధించింది. గత ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిన మద్యం విక్రయాల సగటును బట్టి ప్రస్తుతం దుకాణాలకు సరకు కేటాయిస్తోంది. ప్రతిరోజూ ఆ మేరకు మాత్రమే అమ్మాలని, అంతకుమించి అయితే అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించింది.

ఇదిలావుండగా ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో రాజకీయ పార్టీలు భారీగా డబ్బులు పంచుతున్నాయి. ఆ డబ్బు తీసుకున్న వారిలో చాలామంది మద్యం దుకాణాల వైపు వెళుతున్నారు. దీనివల్ల విక్రయాలు పెరిగాయి. ప్రభుత్వం నిర్దేశించిన సరకు సాయంత్రం ఐదు, ఆరు గంటలయ్యేసరికి అమ్ముడైపోతోంది. ఆ తర్వాత వచ్చే మందుబాబులకు దుకాణాల్లోని సిబ్బంది సరకు లేదని చెప్పి వెనక్కి పంపించేస్తున్నారు. దీనివల్ల మద్యానికి డిమాండ్ ఏర్పడుతోంది. ఇదే అదనుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది కొందరు...బెల్ట్‌షాపుల నిర్వాహకులు, తమ స్నేహితులతో మిలాఖత్ అవుతున్నారు. దుకాణంలోని సరకును మధ్యాహ్నం సమయంలో స్కానింగ్ చేసి వారికి అందజేస్తున్నారు. తర్వాత మద్యం కావాలంటూ దుకాణానికి వచ్చే ... మిగతా 6వ పేజీలో

సంగీతంలో శాస్త్రి కృషి మరువలేం


సంగీత సంస్థ ప్రారంభిస్తున్న అతిథులు

సీతంపేట, ఏప్రిల్ 9: ద్వారకానగర్ రోడ్డు శంకర మఠంలో దివంగత ఐవీఎస్ శాస్త్రి సంగీత సమితి నూతన శాస్త్రీయ సంగీత సంస్థను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కళాభారతి కార్యదర్శి డాక్టర్ జీఆర్‌కే ప్రసాద్, శంకరమఠం అధ్యక్షులు డాక్టర్ టి. రవిరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖలో సంగీత జనకులం స్థాపించి తద్వారా శాస్త్రీయ సంగీత ప్రభవానికి దివంగత ఐవీఎల్ శాస్త్రీ విశేష సేవలను అందజేశారన్నారు. సంగీత పాఠశాల స్థాపించి వందలాది మందికి శాస్త్రీయ సంగీతంపై చక్కని అవగాహన కల్పించిన ఘనత శాస్త్రికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పి.గోపాలరావు, ఐ.లక్ష్మి, కె.సరస్వతి, వి.వి. రమణమూర్తి, జి.శారద, ఎం.వి. రాజశేఖర్, సుబ్రమణ్యం, డి.త్యాగరాజు, వివిబి శంకరం, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కంచరపాలెం, ఏప్రిల్ 9 : అనుమానాస్పదంగా గుర్తతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతదేహం నగ్నంగా తుప్పల్లో పడి ఉండడంతో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసునకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జ్ఞానాపురం శివాలయం వెనుక గల బూట్ లాండ్రీ స్కార్ఫీ సర్వీసెస్ ఎదురుగా గల తుప్పల్లో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించి కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ ఎస్. భాస్కరరావు, ఎస్ఐ సమీర్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు నలభై నుంచి యాభై ఏళ్ల మధ్య ఉంటుంది. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సీఐ ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ బి. నరసింహమూర్తి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత మృతి కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

సీతంపేట, ఏప్రిల్ 9: ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో ద్వారకానగర్ రెండోలైన్‌లో నివాసం ఉంటున్న వివాహిత ఈశ్వరి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విధితమే. ఈ కేసులో ప్రధాన నిందితుడు సాయిద్ ఆలీఖాన్‌ను పోలీసులు అదుపులో తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈశ్వరిని ఇన్సూరెన్స్ పని మీద బయటకు తీసుకువెళ్లిన సాయిద్ ఆలీఖాన్ తిరిగి ఆమె మృతదేహాన్ని తీసుకురావడంపై పలు అనుమానలు వ్యక్తమవుతున్నాయి. ఆమె ఏ విధంగా మృతి చెందిందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో సీఐ ఎస్.రమేశ్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసిన ఎస్ఐ ధర్మేంద్ర పలు కోణాలో దర్యాప్తు చేపడుతున్నారు. అలాగే పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన అనంతరం పూర్తి వివరాలు తెలియనున్నట్లు పోలీసులు తెలుపుతున్నారు.

రెడ్డికంచరపాలెంలో చిల్లర దొంగతనాల జోరు

కంచరపాలెం, ఏప్రిల్ 9: జీవీఎంసీ 55వ వార్డు పరిధి రెడ్డికంచరపాలెంలో చిల్లర దొంగతనాలు పెరుగుతుండడంతో స్థానికులు భయపడుతున్నారు. వాహనాల్లో పెట్రోల్ తీసేయడం, టైర్లు దొంగలించడం, ఇళ్ల ఆవరణలోని వస్తువులు మాయం తదితర సంఘటనలు ఇటీవల తరుచూ చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల ఓ ఇంట్లో దొంగలలు పడి బంగారు వస్తువులను పట్టుకు వెళ్లిపోయారు. దీనికితోడు స్థానిక ఆర్చ్ దగ్గర కొంత మంది ఆకతాయిలు నిత్యం గుంపులుగా ఏర్పడి మద్యం సేవిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. పోలీసులు వీరి అగడాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం


ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వాణిశ్రీ

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 9: వాహనాలు నడిపే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్సై వి.వాణిశ్రీ సూచించారు. సంగం ఆఫీస్ జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం సుప్ర వాహనంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల వీడియోలను వాహనదారులకు చూపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నప్పుడు ముందు, వెనుక వస్తున్న వాహనాలను చూసుకొని జాగ్రత్తగా వెళ్లాలన్నారు. హెల్మెట్ తప్పకుండా ధరించాలనికోరారు. ఆడపిల్లలు రోడ్డుపై వెళ్తున్న సమయంలో ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే దిశ యాప్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవాలో వీడియోలో చూపి వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు అరికట్టడానికి వీలవుతుందన్నారు.

ఆలయాలకు ఉగాది శోభ


కుమ్మరవీధిలో పోలమాంబ అమ్మవారు


షిర్డీసాయికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం


టీపీటీ కాలనీలో అమెరికన్ డైమండ్స్, వెండి అభరణాలతో అలంకరించిన అభయ ఆంజనేయస్వామి

జగదాంబ కూడలి, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం పురస్కరించుకుని పాతనగరంలోని ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. భక్తులు కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు. గ్రేటర్ 30వ వార్డు కుమ్మరవీధి పోలమాంబ అమ్మవారిని అధిక సంఖ్యలో వచ్చి దర్శనం చేసుకున్నారు. ముందుగా అమ్మవారికి అర్చకులు, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులకు ఉగాది పచ్చడి, ప్రసాదాలను ఆలయ కమిటీలు పంపిణీ చేశారు. దనపల్లా వద్ద శివాలయం, మెయిన్ రోడ్డు ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామివార్లను ప్రత్యేక అలంకరణ చేసి భక్తులు దర్శనం కల్పించారు. పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయానికి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి దర్శనం చేసుకున్నారు. జగదాంబ జంక్షన్ పెట్రోలు బంకు వద్ద వినాయకుడి ఆలయం వద్ద భక్తుల రాకతో ఆలయం సందడిగా మారింది. గోత్ర నామాలతో కుటుంబ సమేతంగా భక్తులు వచ్చి అర్చనలు జరుపుకున్నారు. వినాయకునికి పూజలు చేశారు.

షిర్డీ సాయి ధ్యానమందిరంలో ప్రత్యేక పూజలు

అక్కయ్యపాలెం: ఉగాది సందర్భంగా రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో బాబా విగ్రహానికి భక్తులు స్వహస్తాలతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వెయ్యి లీటర్ల పాలతో ఉదయం నుంచి క్షీరాభిషేకంతో పాటు విశేష పూజలు చేశారు. సాయం త్రం పంచాంగ శ్రవణం, గీతాలపన జరిగింది. అనంతరం ఆలయ వ్యవస్థాపకుడు నూకల శేషగిరిరావు, కమిటీ ప్రతినిధులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కంచరపాలెం: తెలుగు నూతన సంవత్సరాది సందర్భంగా కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పలు ఆలయాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఊర్వశి జంక్షన్‌లోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, సూర్యనగర్‌లోని యోగసిద్ధాంజనేయ ఆలయం, ఆర్పీపేట పైడిమాంబ ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల వద్ద పురోహితులు పంచాంగ శ్రవణం చేశారు.

అభయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

సీతమ్మధార: సీతమ్మధార టీపీటీ కాలనీలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆంజనేయస్వామి విగ్రహానికి అమెరికన్ డైమండ్, వెండి, బంగారు అభరణాలతో అందరంగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు కొనసాగాయి. లడ్డూలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

వాకర్స్‌క్లబ్ ఉగాది వేడుకలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ కళా వేదికపై మంగళవారం ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. క్లబ్ అధ్యక్షులు పల్లా. చంద్రమౌళి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం, ఉగాది పురస్కారాల ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సినీ నటులు మిశ్రో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మిశ్రో,ఆయన శిష్యులకు వాకర్స్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పరిసర ప్రాంతాల వారితోపాటు నగరంలోని వాకర్స్ క్లబ్ సభ్యులు, అతిథులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ శ్రీనివాస్ నిరాశ్రయులకు ఉగాది పచ్చడి, మిఠాయిలు పంచిపెట్టారు. నిరాశ్రయులంతా సుఖసంతోషాలతో జీవించాలని శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

సీతారామ కల్యాణ రాట ఉత్సవం

సీతంపేట: గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేటలోని రాధాకృష్ణ మందిరం సమీపంలో సీతారాముల కల్యాణ వసంత నవరాత్రుల రాట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు, స్థానిక ఆలయ భక్తులు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతులు, భక్తులు, గ్రామ పెద్దలు కలిసి ఈ ఉత్సవ రాటను వేశారు. శ్రీరామనవమి రోజు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు సంపంగి శ్రీనివాసరావు తెలిపారు. ఈ పూజ కార్యక్రమలో వైసీపీ నాయకుడు కేకే రాజు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



నిరాశ్రయులకు ఉగాది పచ్చడి అందిస్తున్న శ్రీనివాస్


సీతారామ కల్యాణానికి రాట వేస్తున్న భక్తులు

కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

జగదాంబ కూడలి, ఏప్రిల్ 9: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం ఉగాది వేడుకలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఎస్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్ పంచాంగ శ్రవణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ క్రోధినామ సంవత్సరంలో ప్రజలకు ఎటువంటి మేలు చేకూరుతుంది, దేశంలోని, రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పరిణామాలను విపులీకరించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేద పండింతులు ఆశీర్వచనాలు అందజేశారు. స్వర్ణకవచాలంకరణలో కనకమహాలక్ష్మి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణ భక్తులతో కిటికిటలాడింది. పంచాంగ శ్రవణం చేసిన ప్రసాద్‌ను ఈవో తిరుమలేశ్వరరావు సన్మానించారు.


స్వర్ణకవచాలంకరణలో కనకమహాలక్ష్మి

అంబికాబాగ్‌లో సీతారాముల కల్యాణానికి పెళ్లిరాట

మహారాణిపేట, ఏప్రిల్ 9: అంబికా బాగ్ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీ రామ నవమి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 17న నిర్వహించనున్న శ్రీ రామ నవమి సందర్భంగా ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అధికారులు, ఆలయ పండితులు ఆధ్వర్యంలో మంగళవారం పెళ్లిరాట వేసి శ్రీ రామ చంద్రుడిని పెండ్లికుమారుడిని చేశారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఆలయ సహాయ కార్యనిర్వహక అధికారి కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.


పెళ్లి రాట వేస్తున్న పండితులు, అధికారులు

రాజ్యాంగాన్ని రద్దు చేస్తామనడం సిగ్గుచేటు

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు కృష్ణస్వరూప్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 9: దేశ రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ బీజేపీ సర్కార్ బహిరంగా ప్రకటించడం సిగ్గుచేటని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ రెసిడెన్సీ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల పౌర, మానవ హక్కులు కాలరాయడానికి ఈ డీపీడీ కులాల మనువాద మాఫియా పార్టీలు పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఈ పార్టీల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోకపోతే దళిత బహుజన జాతులకు బానిసత్వం తప్పదన్నారు. రక్షణ, స్వేచ్ఛ సోషల్ జస్టిస్ సాధన కోసం నిజమైన అంబేడ్కర్ రాజకీయ వారసులైన దళితుబహుజన పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి చట్టసభలకు పంపించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా శాఖ అధ్యక్షుడు బాన్న రమేశ్, లీగల్ కన్వీనర్ పీతల కొండలరావు, నగర కన్వీనర్ కొనాల శంకరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు అందని ఈఎస్ఐ సేవలు

- స్థానికంగా ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కార్మిక వర్గం డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 9: విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 12వేల మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ప్లాంట్‌లో విధులు నిర్వహించే కార్మికులకు దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగితే వీరు చికిత్స తీసుకునేందుకు నరకం చూడాల్సిందే. ప్రమాదం జరిగితే తక్షణమే ప్లాంట్‌లో ఉన్న ప్రాథమిక చికిత్స కేంద్రంలో చికిత్స అందిస్తారు. చిన్నచిన్న గాయాలైతే స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తారు. అదే తీవ్రగాయాలైతే ఇబ్బందులు తప్పడం లేదు. ఈస్థితిలో గాయపడిన కాంట్రాక్టు కార్మికుడిని నగరంలో ఉన్న ఈఎస్ఐకు గాని, ఈఎస్ఐకు అనుబంధ ఆస్పత్రులకు తరలిస్తారు. ప్లాంట్ నుంచి నగరానికి తరలించేందుకు సుమారు గంటన్నర సమయం పడుతుంది. ఈ సమయంలో తీవ్ర గాయలపాలైన కార్మికుడు నరకం చూస్తాడు. ఇలాంటి సంఘటనలు ప్లాంట్‌లో ఎన్నో జరిగాయి. గతంలో అయితే మల్కాపురంలో ఆ స్పత్రి ఉండేది. అక్కడ కార్మికులు చికిత్స పొందేవారు. తరువాత ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికిగాను 2014లో షీలానగర్‌లో స్థలం కేటాయించారు. అయితే అక్కడ ఆస్పత్రి నిర్మాణం చేపట్టలేదు.

దీంతో దూర ప్రాంతంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లాల్సిందే. ప్రమాదం జరిగిన వెంటనే ప్రథమ చికిత్స తీసుకొని, ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు అంబులెన్స్ అందుబాటులో ఉన్నా ఆస్పత్రి మాత్రం దూరంగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి



స్టీల్‌ప్లాంట్‌తో పాటు ఇక్కడ చాలా మంది ఇతర సంస్థల్లో కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఈఎస్ఐ సేవలు పొందాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. దురదుష్టవశాత్తు అగ్ని ప్రమాదంలో చిక్కుకుంటే వైద్య సేవలు పొందాలంటే మాత్రం కాంట్రాక్టు కార్మికుడు తీవ్ర నరకం చూస్తున్నాడు. షిలానగర్‌లో త్వరితగతిన ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలి.

- కెఎంఎస్ఎన్. రావు
ఉక్కు గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


సంపత్ వినాయకునికి పూజలు


అర్చకులనుంచి ఆశీర్వచనం తీసుకుంటున్న భక్తులు


ఆలయం ఎదుట బారులుతీరిన భక్తులు

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలను నగరవాసులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. వన్‌టౌన్‌లోని శ్రీ కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయం, ఆశీల్‌మెట్టలోని సంపత్ వినాయకుడి ఆలయంతోపాటు నగర పరిధిలోని పలు దేవాల యాలకు భక్తులతో కిటకిటలాడాయి.

ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఆయా ఆలయాల్లో నిర్వహించారు. రాజకీయ పార్టీ కార్యాలయాలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, ఇతర సంఘాలు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని యువతీ, యువకులు, పెద్దలు సంప్రదాయ వస్త్రధారణలో కనిపించేందుకు ఆసక్తి చూపించారు.

నెరవేరని సొంతింటి కల

... 5వ పేజీ తరువాయి

అప్పి కొండ, నడుపూరు, లంకెలపాలెం వంటి ప్రాంతాల్లో భూసేకరణ చేశారు. వీటితోపాటు సుద్దగెడ్డ, ఆదర్శ నగర్, చిలకపేట, సీహార్స్ జంక్షన్, రాజీవ్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ముత్యాలమ్మ కాలనీ, రాజీవ్ నగర్‌కాలనీ, గౌరీనగర్, ఏఎస్ఆర్ నగర్ వంటి మురికివాడలను తొలగించి అదే స్థలంలో 1,256 ఇళ్లు చొప్పున మొత్తం 31 లేఅవుట్లలో 24,192 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. వీటిలో దాదాపు నాలుగు వేల ఇళ్ల నిర్మాణం పూర్తవడంతో టీడీపీ ప్రభుత్వం 2019 మార్చిలో లబ్ధిదారులకు లాటరీ ద్వారా కేటాయించేసింది. తర్వాత జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్ల కేటాయింపును రద్దు చేసింది. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపిస్తూ, కొత్తగా మళ్లీ సర్వే చేసి గతంలో అర్హులుగా గుర్తించడంతో డీడీలు తీసిన వారిలో 13,761 మందిని అనర్హులుగా తేల్చింది. మిగిలిన 30,083 మందిని మాత్రమే అర్హులుగా తేల్చారు. వీరందరికీ సరిపడా ఇళ్ల నిర్మాణం జరగకపోవడంతో లాటరీ ద్వారా 24,192 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసింది. మిగిలిన వారికి గతంలో తీసిన డీడీలను వెనక్కి ఇవ్వడంతోపాటు ఒక సెంటు చొప్పున జగనన్న కాలనీల్లో ఒక సెంటు చొప్పున స్థలాన్ని అందజేస్తామని చెప్పింది.

ఐదేళ్లలో అడుగు ముందుకు పడని పనులు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ హయాంలో నిర్మాణం పూర్తయిన సముదాయాలకు ఉన్న రంగులను మార్చేసి వైసీపీ జెండాను పోలిన రంగులను వేయించింది. వైసీపీ అధికారం చేపట్టిన ఏడాదిలోనే నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించిన మంత్రులు గత ఐదేళ్లలో కేవలం 7,456 ఇళ్లు మాత్రమే (టీడీపీ హయాంలో చివరి దశకు చేరిన నిర్మాణాలను పూర్తిచేయడంపైనే దృష్టిపెట్టారు తప్పితే మిగిలిన నిర్మాణాలను విస్మరించారు) లబ్ధిదారులకు అప్పగించారు. వీటిలో చాలాచోట్ల కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఆయా ఇళ్లలోకి వెళ్లలేదు. దీంతో అవన్నీ ఖాళీగానే ఉండిపోయాయి. బక్కన్నపాలెంలో టిడ్కో సముదాయాలు ముళ్లపొదలతో మందుబాబులు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. చీమలాపల్లిలో మొండిగోడలతోనే నిర్మాణాలను నిలిపేయడంతో శిధిలావస్థకు చేరుకున్నాయి. ఐదేళ్లలో అదిగో...ఇదిగో అంటూ ఆశల పల్లకిలో ఊరేగించిన వైసీపీ నేతలు, అధికారులు ఇప్పటికీ తమకు సొంత ఇంటి కల నెరవేరకుండా చేశారంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

వైసీపీకి షాక్

... 5వ పేజీ తరువాయి

కండువా కప్పుకున్నారు. ఆయనతోపాటు 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, దుర్గాలమ్మ దేవస్థానం ధర్మకర్త బత్తి మంగరాజు, గరుడ సత్రం ధర్మకర్త చరకం మణమ్మ, 35వ వార్డు వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరీశంకర్, వర్తక సంఘం జిల్లా సభ్యులు రామిరెడ్డి, నిమ్మ శ్రీనివాస్, ముక్కు శ్రీనులు టీడీపీలో చేరారు. దక్షిణ నియోజకవర్గానికి చెందిన మరో ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు కూడా త్వరలో టీడీపీలో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. సుధాకర్‌కు ఏదైనా బాధ్యత అప్పగించిన వెంటనే తాము కూడా టీడీపీలో చేరిపోతామని దక్షిణ నియోజకవర్గానికి చెందిన వైసీపీ అసమ్మతి కార్పొరేటర్ ఒకరు తెలిపారు.

బ్లాక్‌లో మద్యం విక్రయాలు

... 5వ పేజీ తరువాయి

మందుబాబులకు తమతో ముందుగానే అవగాహన ఏర్పరచుకున్న బెల్ట్‌షాపు నిర్వాహకులు, స్నేహితుల ఫోన్ నంబర్ ఇచ్చి వారి వద్ద నుంచి కొనుక్కోవాలంటూ సలహా ఇస్తున్నారు. దీంతో మందుబాబులు వారి వద్దకు వెళ్లి సీసాకు రూ.వంద వరకూ అదనంగా చెల్లించి కొనుక్కుంటున్నారు. ప్రస్తుతం నగరంలో పలు పాన్‌షాప్‌లు, చిన్న చిన్న కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్నారు. ఎండాడలోని ఒక ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద ప్రతిరోజూ ఒక యువకుడు బైక్‌పై వచ్చి తనను సంప్రతించిన వారికి మద్యం సరఫరా చేస్తున్నాడు. ఈ విషయం ఎక్సైజ్‌శాఖ అధికారుల వద్ద ప్రస్తావించగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్యం విక్రయాలపై సీలింగ్ విధించామన్నారు. బెల్ట్ దుకాణాలపై సెబ్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

విశాఖ నుంచి బ్యాంకాక్ విమానం ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

కుమార్‌రాజా, నరేశ్‌కుమార్, వర్మ, విజయమోహన్‌లు మాట్లాడుతూ భారత కాలమానం ప్రకారం ఇది విశాఖపట్నంలో రాత్రి 11.50 గంటలకు బయలుదేరి 2.30 గంటలకు బ్యాంకాక్‌లో ల్యాండ్ అవుతుందన్నారు. అక్కడ రాత్రి 7.50 గంటలకు బయలుదేరే విమానం విశాఖపట్నంలో అదేరోజు రాత్రి 11.20 గంటలకు చేరుతుందని వివరించారు. ప్రయాణానికి 2.40 గంటల సమయం పడుతుందన్నారు. ఇది మంగళ, గురు, శనివారాల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఐపీఎల్‌లో లోకల్ బాయ్ నితీష్ మెరుపులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 9: ఐపీఎల్ మ్యాచ్‌లో నగరానికి చెందిన నితీష్‌కుమార్‌రెడ్డి (64) మెరుపులు మెరిపించాడు. సన్ రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడుతున్న నితీష్ మంగళవారం పంజాబ్‌లోని ముల్లన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సిక్సర్లు, బౌండరీలతో చెలరేగాడు. సన్‌రైజర్స్ కేవలం 39 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన దశలో క్రీజులోకి వచ్చిన నితీష్‌కుమార్‌రెడ్డి పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. హర్‌ప్రీత్ బ్రర్ వేసిన ఒక ఓవర్‌లో రెండో బంతి బౌండరీ, మూడో బంతి సిక్సర్, నాలుగో బంతి బౌండరీ, ఐదో బంతి సిక్సర్ బాదిన నితీష్ ఆరో బంతికి రెండు పరుగులు చేసి మొత్తం 22 పరుగులు రాబట్టాడు. కేవలం 32 బంతుల్లో మూడు బౌండరీలు, ఐదు సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తిచేసిన నితీష్‌కుమార్‌రెడ్డి...వ్యక్తిగత స్కోరు 64 పరుగుల వద్ద అర్షదీప్‌సింగ్ బౌలింగ్‌లో రబడ క్యాచ్ పట్టడంతో అవుటయ్యాడు.

పొంచి ఉన్న ప్రమాదం

జగదాంబ కూడలి, ఏప్రిల్ 9: గ్రేటర్ 30 వార్డు కుమ్మరవీధి ప్రధాన రహదారి వద్ద అండర్ డ్రైనేజీ పైకప్పు పూర్తిగా మూసుకోకపోవడంతో ప్రమాదకరంగా మారింది. జీవీఎంసీ యూజీడీ విభాగం డ్రైనేజీ పైకప్పుతెరచి పనులు చేసుకొని తిరిగి పూర్తిగా మూసివేయకుండా వదిలేశారు. ఈవిషయంపై పలు మార్లు సంబంధత సిబ్బందికి తెలియజేసినా నిర్లక్ష్యంగా వదిలేశారని స్థానికులు వాపోతున్నారు. వాహదారులు అనేక సార్లు ఈ డ్రైనేజీ వద్ద ప్రమాదం బారినపడినట్టు అంటున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు ఇక్కడ ప్రమాదానికి లోనవుతున్నారు. పిల్లల ఆటలాడుకునే సమయంలో పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డు కార్పొరేటర్, వైసీపీ వార్డు స్థాయినాయకులు కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తక్షణం అధికారులు చర్యలు తీసుకొని అండర్ డ్రైనేజీ పైకప్పు సరిచేయాలని కోరుతున్నారు.


కుమ్మరవీధి ప్రధాన రహదారి మధ్యలో తెరచి ఉన్న అండర్ డ్రైనేజీ పైకప్పు

ఎండుతున్న చెరువులు

మధురవాడ, ఏప్రిల్ 9: వేసవి తీవ్రతతో మధురవాడ పరిసరాల్లోని చెరువులు ఎండి పోతున్నా యి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. ఇళ్లలో ఉన్న బోరుబావుల నుంచి అవసరం మేరకు నీరు రావడం లేదని పలువురు వాపోతున్నారు. అపార్టుమెంట్‌వాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఒక వైపు వేసవిలో నీటి వినియోగం పెరగడం, మరోవైపు చెరువులు, గెడ్డలు ఎండిపోవడంతో కటకటలాడుతున్నారు. వర్షాకాలంలో నిండుగా నీటితో కళకళలాడిన శిల్పారామం చెరువులో ప్రస్తుతం చుక్కనీరు లేదు. బొట్టవానిపాలెం ఎండోడు చెరువు, నగరంపాలెం రాళ్ళచెరువులో కూడా నీరులేక బీటలువారాయి. కొన్ని చెరువులు స్థానికుల నిర్లక్ష్యం కారణంగానే ఎండిపోయాయి. డెబ్రిస్‌ని చెరువుల్లో వేయడం తో పాటు పనికిరాని వ్యర్థాలను, ప్లాస్టిక్ సామగ్రిని వేస్తుండడంతో అవి నీటిని నిల్వఉంచుకునే సామర్థ్యం కోల్పోయాయి. దీంతో మండుతున్న ఎండలకు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటాయి. ఇకనైనా అధికారులు జలవనరుల్లో పూడికలు తీయించి, సిద్ధం చేస్తే రానున్న వర్షాకాలంలో నీటితో నిండుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


చుక్కనీరులేని శిల్పారామం చెరువు



క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభిస్తున్న దృశ్యం

ఉక్కునగరంలో 'ఫ్రైడే' సినిమా షూటింగ్

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 9: గణేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై దూలిపూడి దర్శకత్వంలో కేసనకుర్తి శ్రీనివాస్, వర్మ కంబాల నిర్మాత, సహా నిర్మాతలుగా వ్యవహరిస్తూ రూపొందిస్తున్న 'ఫ్రైడే' సినిమా షూటింగ్ మంగళవారం స్టీల్‌ప్లాంట్ జగన్నాథస్వామి ఆలయంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్శకుడు ఈశ్వర్ దూలిపుడి, కథానాయక దియారాజ్ మాట్లాడుతూ మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నామని, ప్రతి సన్నివేశం అందరినీ అలరించేలా.. ఆలోచింపజేసేలా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవాలకు శ్రీకారం



ఊరేగింపులో భక్తులు

పెందుర్తి-రూరల్, ఏప్రిల్ 9: ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని చింతల అగ్రహారంలోని రామాలయంలో మంగళవారం సీతారాముల కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. వాస్తు శాస్త్ర పండితుడు మల్లిమణుగుల భాస్కరరావు ఆధ్వర్యంలో ఉదయం నిశ్చితార్థ వేడుకలను నిర్వహించారు. స్థానిక త్రిమాత ఆలయం నుంచి శ్రీరాముడిని, శివాలయం నుంచి సీతాదేవిని ఊరేగింపుగా రామాలయం వద్దకు తీసుకువచ్చి నిశ్చితార్థం జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు ఆళ్ల తాతారావు, పి.వెంకటరమణ, ఎం.శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దింటమ్మ పరస

మల్కాపురం, ఏప్రిల్ 9: ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం మల్కాపురంలో పెద్దింటమ్మ పరసను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాపురం పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు వేకువజాము నుంచే అమ్మవారిని ఆలయానికి విచ్చేసి పూజలు చేశారు. పూజాది కార్యక్రమాల్లో పలు రాజకీయ పార్టీల నాయకులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు.

సీతారాముల కల్యాణానికి ఉడుపు రాట

అలాగే ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా ఇక్కడి నగరాల వీధిలో ఉన్న రామాలయం వద్ద సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆలయ ధర్మకర్త భోగవిల్లి నాగభూషణం దంపతులు ఉడుపు రాట వేశారు.

పెంటమాంబ ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

గ్రేటర్ 59వ వార్డు హిమాచల్‌నగర్ జంక్షన్‌లో ఉన్న పెంటమాబ అమ్మవారి 42వ తీర్థ మహోత్సవాలను మే 16 నుంచి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తామని అమ్మవారి ఆలయ కమిటీ ప్రతినిది నమ్మి గౌరీశ్వరరావు తెలిపారు. ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశాక పెంటమాంబ తీర్థానికి సంబంధించిన కరపత్రాలను ఆలయ సన్నిధిలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేశ్, లుకేశ్ కన్‌స్ట్రక్షన్ అధినేత ముంగర నరేంద్ర నారాయణరాజు, సినీ నటుడు పొట్టిమూర్తి, న్యాయవాది కోలా వెంకటరమణ, ఆలయ కమిటీ ప్రతినిధులు గండేపల్లి షణ్ముఖ గురునాథరావు, ఆర్.అప్పలరాజు, సాలాపు రవి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, శారద, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిలిత (శ్రీహరిపురం), శ్రీకన్య-1, హెవెన్, లక్ష్మీకాంత్ (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 22, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 24, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళదుంపలు 21, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 150, బరబాటి 22, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 28, దోస కాయలు 12, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 110, పొటల్స్ 64, కీరదోస 22, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 45, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	405
విజయనగరం	409
శ్రీకాకుళం	409

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	-- 125
ఫారం ధర	-- 145
విత్ స్కిన్	-- 260
స్కిన్‌లెస్	-- 270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



లక్కరాజుపాలెంలో ప్రమాదకరమైన మలుపు



అగనంపూడి-దువ్వాడ రోడ్డులోని కోళ్ల ఫారాల వద్ద డేంజరస్ టర్నింగ్..

ఆ మలుపుల్లో జర జాగ్రత్త!

అగనంపూడి-దువ్వాడ రహదారిలో ప్రమాదకర మలుపులు..
తరచూ ప్రమాదాలతో భీతిల్లుతున్న వాహనదారులు
పట్టించుకోని అధికారులు

అగనంపూడి, ఏప్రిల్ 9: జాతీయ రహదారి అగనంపూడి ఆంజనేయస్వామి ఆలయ కూడలి నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలోని మలుపులు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఇక్కడి లక్కరాజుపాలెం, కోళ్లఫారాల వద్ద, దువ్వాడ గ్రామానికి చేరువలో అధికంగా మలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయా మలుపులు 'యు' ఆకారం, 'ఎస్' ఆకారాల్లో ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపానికి వచ్చేంత వరకు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు దువ్వాడ రైల్వే స్టేషన్‌కు, వీఈపీజెడ్‌కు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇక్కడ మలుపులు సూచించే హెచ్చరిక బోర్డులు, స్టాపర్లు, స్పీడ్ బ్రేకర్లు వంటివి లేకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో మలుపులకు తోడు వీధి లైట్లు లేకపోవడంతో ఇటుగా ప్రయాణించేందుకే వాహన చోదకులు హడలిపోతున్నారు. చీకటి పడితే ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు భీతిల్లుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల కిందట జీవీఎంసీ నిధులు వెచ్చించి ఈ రహదారిని విస్తరించింది.

అయినప్పటికీ మలుపుల వద్ద ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టలేదు. ఈ క్రమంలో మలుపుల వద్ద పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే పలువురు మృత్యువాత పడగా, చాలామంది గాయపడిన ఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని మలుపుల వద్ద భద్రతా చర్యలు చేపట్టవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

మలుపుల వద్ద భయమేస్తుంది..



అగనంపూడి నుంచి దువ్వాడ వెళ్లే రహదారిలో ప్రయాణించాలంటే మలుపులు వద్ద భయమేస్తుంది. మలుపుల వద్దకు వచ్చేసరికి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ముందుకు సాగాల్సి వస్తోంది. దగ్గరకు వచ్చేంత వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు, స్టాపర్లు, స్పీడ్ బ్రేకర్లు వంటివి ఏర్పాటు చేయాలి. వీధి లైట్లు లేకపోవడంతో రాత్రిపూట సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. అధికారులు చొరవ తీసుకుని ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.

-అట్టా రమేశ్, అగనంపూడి



వెంకటాద్రి శిఖరంపై చందన అలంకరణలో శ్రీవారు



చట్టివానిపాలెంలో పూజలు అందుకున్న నూకాలమ్మ తల్లి



కొత్తపాలెంలో ఆలయ వార్షికోత్సవం సందర్భంగా దుర్గమాంబకు పూజలు..



ఎస్టీబీఎల్‌లో శ్రీవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

వైభవంగా ఉగాది వేడుకలు

క్రోధి నామ సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 9: క్రోధి నామ సంవత్సరం సందర్భంగా గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో ఉగాది వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెలుగు నూతన సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని ఆలయాలకు పెద్దసంఖ్యలో ప్రజలు విచ్చేసి పూజలు చేశారు. పలుచోట్ల పంచాగ శ్రవణం చేశారు. కాగా ఇక్కడి బీజేపీ కార్యాలయంలో జరిగిన ఉగాది సంబరాల్లో నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

కూర్మన్నపాలెం: ఉగాది పండుగ సందర్భంగా 87వ వార్డు పరిధి వడ్లపూడి, కణితి, లక్ష్మీపురం నూకాలమ్మ ప్రత్యేక పూజలు చేశారు. కణితి గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే 87వ వార్డు కూర్మన్నపాలెం సంపత్ వినాయక ఆలయం, వేణుగోపాలస్వామి, సంతమామిడితోటలోని శివాలయం, లక్ష్మీపురం కాలనీలోని వేంకటేశ్వరస్వామి, 88వ వార్డులోని గ్రీన్‌సిటీ శ్రీవారి ఆలయం, 71వ వార్డు శ్రీనగర్‌లోని శ్రీశ్రీకృష్ణుని ఆలయం, సంపత్ వినాయకుని ఆలయాల్లో జరిగిన పూజాది కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. అఫీషియల్ కాలనీలోని వినాయకున్ని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

నూకాంబిక ఆలయంలో కుంకుమ పూజలు

జీవీఎంసీ 70వ వార్డు చట్టివానిపాలెంలోని నూకాంబిక ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. ఎల్‌వీ నగర్, ఎర్రగెడ్డ కాలనీల్లోని లక్ష్మీగణపతి, పైడితల్లి, నూకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. డ్రైవర్స్ కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో అర్చకులు సోమేశ్వరశర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

పెదగంట్యాడ: ఇక్కడి అహింస పిరమిడ్ ధ్యానకేంద్రంలో, ప్రియదర్శినీ కాలనీ, వికాస్‌నగర్ శివాలయాల్లో, వెంకటాద్రి శ్రీవారి ఆలయంలో, పెంటమాంబ ఆలయం, పెదనడుపూరు కమ్యూనిటీ హాల్, సీతానగరం రామాలయం, దుర్గవానిపాలెం శివాలయంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. పలుచోట్ల పంచాంగ శ్రవణం చేపట్టారు.



శేషాద్రి కొండపై కల్యాణ వెంకన్నకు మల్లెలతో పుష్పార్చన..

గోపాలపట్నం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. నూకాంబిక ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజలు నిర్వహించారు. స్థానిక కొత్తపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్లను పరిసర ప్రాంతాల ప్రజలు దర్శించారు.

పెందుర్తి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీవారిని చందనంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఇందుకోసం 27 కిలోల చందనాన్ని వినియోగించారు. చందనపూరితుడైన వేంకటేశ్వరస్వామిని దర్శించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి, ప్రసాద వితరణ చేపట్టారు.

శారదా పీఠంలో పంచాంగం ఆవిష్కరణ

చినముషిడివాడలోని శారదా పీఠం ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మంగళవారం ఆవిష్కరించారు. పీఠం ఆస్థాన సిద్ధాంతి తెన్నేటి శ్రీనివాసశర్మ పంచాంగ శ్రవణం చేశారు. రాశుల వారీగా గోచార ఫలితాలను వివరించారు. ముందుగా పీఠం అధిష్టాన దేవత శారదా స్వరూపా రాజశ్యామల అమ్మవారికి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నివేదించిన ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. మండంలోని సరిపల్లిలోని రామాలయ ప్రాంగణంలో పురోహితుడు ముక్కు శివరామకృష్ణ శర్మ పంచాగ శ్రవణం చేశారు. ఏరువాక ముహూర్తాన్ని నిర్ణయించారు. అందరూ పర ద్వేషాన్ని వీడనాడి శివారాధన చేయాలని కోరారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని బాలాజీ దివ్యక్షేత్రంలో చందనంతో అలంకరించబడిన వేంకటేశ్వరస్వామిని దర్శించేందుకు భక్తులు బారులుతీరారు. శ్రీవారికి ఎస్టీబీఎల్ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు, జీవి కృష్ణయ్యతో పాటు పాలకమండలి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా పల్లకీలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి ఊరేగించారు. ప్రముఖ వేదపండితులు ప్రవీణ్‌కుమార్ పంచాంగ శ్రవణం చేశారు. బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వెంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో వేదపండితులు శ్రీవారిని పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పువ్వులు, నగలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం వేదపడితులు పంచాగ శ్రవణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేపగుంట: నాయుడుతోటలోని రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలోని శ్రీవారు వెండి కిరీటంతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి స్వర్ణ పుష్పాలతో పూజలు జరిపారు. సాయంత్రం లక్ష మల్లెలతో పుష్పార్చన చేశారు. పూజల్లో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు దంపతులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కృష్ణానగర్ గణపతి ఆలయంలో స్వామివారికి గరికతో పూజించారు. కృష్ణానగర్ గుడివీధి దుర్గామల్లేశ్వరాలయంలో, వేపగుంట ముత్యమాంబ ఆలయంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90,52వ వార్డుల పరిసరాల్లోని ఆలయాల్లో పూజలు, అర్చనలు చేశారు. ఎన్ఏడీ సమీపంలోని సుబ్రహ్మణ్యేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరపారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేపట్టారు.



ప్రశాంతినగర్‌లో వివిధ రకాల పుష్పాల నడుమ సాయినాథుడు

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 9: స్టీల్‌ప్లాంట్ ప్రధాన గేటు వరకు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఉక్కు ఉద్యోగులు కోరుతున్నారు. గతంలో నగరం నుంచి ఇక్కడకు బస్సులు నడిపేవారని, ప్రస్తుతం ఈ సర్వీసులను నిలిపివేయడం వల్ల తాము ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు ఉండడం వల్ల అన్ని వర్గాల వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, ఈ సర్వీసులను పునరుద్ధరిస్తే ఆర్టీసీకి ఆదాయంతో పాటు ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని వారు పేర్కొంటున్నారు.

వైభవంగా అప్పన్న తిరువీధి

సింహాచలం, ఏప్రిల్ 9: ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో వరాహ లక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అలంకారి కరి సీతారామాచార్యులు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి పల్లకిలో అధిష్టింపజేశారు. కోలాట కళాకారులు నృత్యాలు చేస్తుండగా ఆలయ విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితుల వేద పఠనాల నడుమ, భక్తుల హరినామ స్మరణలతో స్వామివారి తిరువీధి మాడవీధుల్లో సాగింది.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 9: స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో ఉంచేలా చూసూ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,153వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణకు యత్నిస్తున్న కేంద్రానికి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం భావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్నకు వెండి గిన్నెలు బహూకరణ



అగనంపూడి, ఏప్రిల్ 9: జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి శాంతినగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి స్థానికంగా గల భక్తులు 108 వెండి గిన్నెలను బహూకరించారు. మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి, నాయుడు, కృష్ణారావు, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, రామారావు, హరిబాబు, చల్లా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నారసింహుని సన్నిధిలో సూర్యకిరణాలు



ఆలయంలోకి ప్రసరిస్తున్న సూర్యకిరణాలు

సింహాచలం, ఏప్రిల్ 9: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయ సన్నిధిలో ఉగాది పర్వదినాన ప్రత్యక్షదైవం సూర్యనారాయణుని కిరణాలు తాకే దృశ్యం ఆవిష్కృతమైంది. దేవాలయ నిర్మాణ కౌశల్యం కారణంగా ఏటా ఉగాది పర్వదినాన సూర్యాస్తమయ సమయాన సూర్యకిరణాలు అప్పన్న స్వామి అంతరాలయంలోకి వెళ్తాయి. ఈ అపురూప ఘట్టానికి మూడేళ్లుగా వాతావరణ ప్రతికూల పరిస్థితులతో భక్తులు దూరమయ్యారు. ఈ ఏడాది మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణం ముగిసిన తరువాత గురుడమండపం మీదుగా ధ్వస్తంభం దాటి ఆస్థాన మండపం, నీలాద్రిగుమ్మం, భోగమండపాలు దాటి అంతరాలయంలోని అప్పన్నస్వామి సన్నిధికి సూర్యకిరణాలు చేరుకున్నాయి. ఆ దృశ్యాన్ని తిలకించిన భక్తులు ఆనంద పరవశులయ్యారు.

ఘనంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఏప్రిల్ 9: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొత్తపాలెం గ్రామస్థుల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయ 14వ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున దుర్గమాంబను నూతన వస్త్రాలు, పత్యేక పుష్పాలతో అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ప్రతినిధులు యఅన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కోలాటాలు, చిడతలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గొల్లవిల్లి సన్యాసిరావు, నాగరాజు, నీలకంఠం, చిన్నారావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సత్రం జంక్షన్‌లో చలివేంద్రం ప్రారంభం

అగనంపూడి, ఏప్రిల్ 9: ఇక్కడి సత్రం జంక్షన్‌లో గల మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి అధ్యక్షురాలు చిత్తా జానకిదేవి ముఖ్యఅతిథిగా విచ్చేసి చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. అగనంపూడి ప్రాంతంలో సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమైనవని, వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సద్భావన సేవా సంఘం అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ, సంస్థ ప్రతినిధులు చిత్తా రామారావు, బి.సత్యనారాయణ, నెల్లి తులసి, నాగార్జున, తాతారావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంగీతంలో శాస్త్రి కృషి మరువలేం


సంగీత సంస్థ ప్రారంభిస్తున్న అతిథులు

సీతంపేట, ఏప్రిల్ 9: ద్వారకానగర్ రోడ్డు శంకర మఠంలో దివంగత ఐవీఎస్ శాస్త్రి సంగీత సమితి నూతన శాస్త్రీయ సంగీత సంస్థను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కళాభారతి కార్యదర్శి డాక్టర్ జీఆర్కే ప్రసాద్, శంకరమఠం అధ్యక్షులు డాక్టర్ టి. రవిరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖలో సంగీత జనకులం స్థాపించి తద్వారా శాస్త్రీయ సంగీత ప్రభవానికి దివంగత ఐవీఎల్ శాస్త్రీ విశేష సేవలను అందజేశారన్నారు. సంగీత పాఠశాల స్థాపించి వందలాది మందికి శాస్త్రీయ సంగీతంపై చక్కని అవగాహన కల్పించిన ఘనత శాస్త్రికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పి.గోపాలరావు, ఐ.లక్ష్మి, కె.సరస్వతి, వి.వి. రమణమూర్తి, జి.శారద, ఎం.వి. రాజశేఖర్, సుబ్రమణ్యం, డి.త్యాగరాజు, వివిబి శంకరం, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కంచరపాలెం, ఏప్రిల్ 9 : అనుమానాస్పదంగా గుర్తతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతదేహం నగ్నంగా తుప్పల్లో పడి ఉండడంతో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసునకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జ్ఞానాపురం శివాలయం వెనుక గల బూట్ లాండ్రీ స్కార్ఫీ సర్వీసెస్ ఎదురుగా గల తుప్పల్లో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించి కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ ఎస్. భాస్కరరావు, ఎస్ఐ సమీర్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు నలభై నుంచి యాభై ఏళ్ల మధ్య ఉంటుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సీఐ ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ బి. నరిసింహమూర్తి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత మృతి కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

సీతంపేట, ఏప్రిల్ 9: ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో ద్వారకానగర్ రెండోలైన్‌లో నివాసం ఉంటున్న వివాహిత ఈశ్వరి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విధితమే. ఈ కేసులో ప్రధాన నిందితుడు సాయిద్ ఆలీఖాన్‌ను పోలీసులు అదుపులో తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈశ్వరిని ఇన్సూరెన్స్ పని మీద బయటకు తీసుకువెళ్లిన సాయిద్ ఆలీఖాన్ తిరిగి ఆమె మృతదేహాన్ని తీసుకురావడంపై పలు అనుమానలు వ్యక్తమవుతున్నాయి. ఆమె ఏ విధంగా మృతి చెందిందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో సీఐ ఎస్.రమేశ్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసిన ఎస్ఐ ధర్మేంద్ర పలు కోణాలో దర్యాప్తు చేపడుతున్నారు. అలాగే పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన అనంతరం పూర్తి వివరాలు తెలియనున్నట్లు పోలీసులు తెలుపుతున్నారు.

రెడ్డికంచరపాలెంలో చిల్లర దొంగతనాల జోరు

కంచరపాలెం, ఏప్రిల్ 9: జీవీఎంసీ 55వ వార్డు పరిధి రెడ్డికంచరపాలెంలో చిల్లర దొంగతనాలు పెరుగుతుండడంతో స్థానికులు భయపడుతున్నారు. వాహనాల్లో పెట్రోల్ తీసేయడం, టైర్లు దొంగలించడం, ఇళ్ల ఆవరణలోని వస్తువులు మాయం తదితర సంఘటనలు ఇటీవల తరుచూ చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు వస్తువులను పట్టుకు వెళ్లిపోయారు. దీనికితోడు స్థానిక ఆర్చ్ దగ్గర కొంత మంది ఆకతాయిలు నిత్యం గుంపులుగా ఏర్పడి మద్యం సేవిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. పోలీసులు వీరి అగడాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం


ఎల్ఈడీ స్క్రీన్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వాణిశ్రీ

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 9: వాహనాలు నడిపే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్సై వి.వాణిశ్రీ సూచించారు. సంగం ఆఫీస్ జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం సుప్ర వాహనంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల వీడియోలను వాహనదారులకు చూపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నప్పుడు ముందు, వెనుక వస్తున్న వాహనాలను చూసుకొని జాగ్రత్తగా వెళ్లాలన్నారు. హెల్మెట్ తప్పకుండా ధరించాలనికోరారు. ఆడపిల్లలు రోడ్డుపై వెళ్తున్న సమయంలో ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే దిశ యాప్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవాలో వీడియోలో చూపి వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు అరికట్టడానికి వీలవుతుందన్నారు.

ఆలయాలకు ఉగాది శోభ


కుమ్మరవీధిలో పోలమాంబ అమ్మవారు


షిర్డీసాయికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం


టీపీటీ కాలనీలో అమెరికన్ డైమండ్స్, వెండి అభరణాలతో అలంకరించిన అభయ అంజనేయస్వామి

జగదాంబ కూడలి, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం పురస్కరించుకుని పాతనగరంలోని ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. భక్తులు కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు. గ్రేటర్ 30వ వార్డు కుమ్మరవీధి పోలమాంబ అమ్మవారిని అధిక సంఖ్యలో వచ్చి దర్శనం చేసుకున్నారు. ముందుగా అమ్మవారికి అర్చకులు, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులకు ఉగాది పచ్చడి, ప్రసాదాలను ఆలయ కమిటీలు పంపిణీ చేశారు. దసపల్లా వద్ద శివాలయం, మెయిన్ రోడ్డు ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామివార్లను ప్రత్యేక అలంకరణ చేసి భక్తులు దర్శనం కల్పించారు. పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయానికి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి దర్శనం చేసుకున్నారు. జగదాంబ జంక్షన్ పెట్రోలు బంకు వద్ద వినాయకుడి ఆలయం వద్ద భక్తుల రాకతో ఆలయం సందడిగా మారింది. గోత్ర నామాలతో కుటుంబ సమేతంగా భక్తులు వచ్చి అర్చనలు జరుపుకున్నారు. వినాయకునికి పూజలు చేశారు.

షిర్డీ సాయి ధ్యానమందిరంలో ప్రత్యేక పూజలు

అక్కయ్యపాలెం: ఉగాది సందర్భంగా రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో బాబా విగ్రహానికి భక్తులు స్వహస్తాలతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వెయ్యి లీటర్ల పాలతో ఉదయం నుంచి క్షీరాభిషేకంతో పాటు విశేష పూజలు చేశారు. సాయంత్రం పంచాంగ శ్రవణం, గీతాలపన జరిగింది. అనంతరం ఆలయ వ్యవస్థాపకుడు నూకల శేషగిరిరావు, కమిటీ ప్రతినిధులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కంచరపాలెం: తెలుగు నూతన సంవత్సరాది సందర్భంగా కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పలు ఆలయాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఊర్వశి జంక్షన్‌లోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, సూర్యనగర్‌లోని యోగసిద్ధాంజనేయ ఆలయం, ఆర్పీపేట పైడిమాంబ ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల వద్ద పురోహితులు పంచాంగ శ్రవణం చేశారు.

అభయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

సీతమ్మధార: సీతమ్మధార టీపీటీ కాలనీలోని అభయ అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అంజనేయస్వామి విగ్రహానికి అమెరికన్ డైమండ్, వెండి, బంగారు అభరణాలతో అందరంగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు కొనసాగాయి. లడ్డూలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అంజనేయస్వామిని దర్శించుకున్నారు.

వాకర్స్‌క్లబ్ ఉగాది వేడుకలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ కళా వేదికపై మంగళవారం ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. క్లబ్ అధ్యక్షులు పల్లా. చంద్రమౌళి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం, ఉగాది పురస్కారాల ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సినీ నటులు మిశ్రో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మిశ్రో,ఆయన శిష్యులకు వాకర్స్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పరిసర ప్రాంతాల వారితోపాటు నగరంలోని వాకర్స్ క్లబ్ సభ్యులు, అతిథులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ శ్రీనివాస్ నిరాశ్రయులకు ఉగాది పచ్చడి, మిఠాయిలు పంచిపెట్టారు. నిరాశ్రయులంతా సుఖసంతోషాలతో జీవించాలని శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

సీతారామ కల్యాణ రాట ఉత్సవం

సీతంపేట: గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేటలోని రాధాకృష్ణ మందిరం సమీపంలో సీతారాముల కల్యాణ వసంత నవరాత్రుల రాట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు, స్థానిక ఆలయ భక్తులు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతులు, భక్తులు, గ్రామ పెద్దల కలిసి ఈ ఉత్సవ రాటను వేశారు. శ్రీరామనవమి రోజు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు సంపంగి శ్రీనివాసరావు తెలిపారు. ఈ పూజ కార్యక్రమలో వైసీపీ నాయకుడు కేకే రాజు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



నిరాశ్రయులకు ఉగాది పచ్చడి అందిస్తున్న శ్రీనివాస్


సీతారామ కల్యాణానికి రాట వేస్తున్న భక్తులు

కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

జగదాంబ కూడలి, ఏప్రిల్ 9: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం ఉగాది వేడుకలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఎస్వీఎస్ఆర్కే ప్రసాద్ పంచాంగ శ్రవణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ క్రోధినామ సంవత్సరంలో ప్రజలకు ఎటువంటి మేలు చేకూరుతుంది, దేశంలోని, రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పరిణామాలను విపులీకరించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేద పండింతులు ఆశీర్వచనాలు అందజేశారు. స్వర్ణకవచాలంకరణలో కనకమహాలక్ష్మి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణ భక్తులతో కిటికిటలాడింది. పంచాంగ శ్రవణం చేసిన ప్రసాద్‌ను ఈవో తిరుమలేశ్వరరావు సన్మానించారు.


స్వర్ణకవచాలంకరణలో కనకమహాలక్ష్మి

అంబికాబాగ్‌లో సీతారాముల కల్యాణానికి పెళ్లిరాట

మహారాణిపేట, ఏప్రిల్ 9: అంబికా బాగ్ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీ రామ నవమి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 17న నిర్వహించనున్న శ్రీ రామ నవమి సందర్భంగా ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అధికారులు, ఆలయ పండితులు ఆధ్వర్యంలో మంగళవారం పెళ్లిరాట వేసి శ్రీ రామ చంద్రుడిని పెండ్లికుమారుడిని చేశారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఆలయ సహాయ కార్యనిర్వహక అధికారి కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.


పెళ్లి రాట వేస్తున్న పండితులు, అధికారులు

రాజ్యాంగాన్ని రద్దు చేస్తామనడం సిగ్గుచేటు

» దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు కృష్ణస్వరూప్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 9: దేశ రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ బీజేపీ సర్కార్ బహిరంగా ప్రకటించడం సిగ్గుచేటని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ రెసిడెన్సీ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల పౌర, మానవ హక్కులు కాలరాయడానికి ఈ దోపిడీ కులాల మనువాద మాఫియా పార్టీలు పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఈ పార్టీల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోకపోతే దళిత బహుజన జాతులకు బానిసత్వం తప్పదన్నారు. రక్షణ, స్వేచ్ఛ సోషల్ జస్టిస్ సాధన కోసం నిజమైన అంబేద్కర్ రాజకీయ వారసులైన దళితుబహుజన పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి చట్టసభలకు పంపించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా శాఖ అధ్యక్షుడు బొన్న రమేశ్, లీగల్ కన్వీనర్ పీతల కొండలరావు, నగర కన్వీనర్ కొనాల శంకరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు అందని ఈఎస్ఐ సేవలు

» స్థానికంగా ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కార్మిక వర్గం డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 9: విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 12వేల మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ప్లాంట్‌లో విధులు నిర్వహించే కార్మికులకు దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగితే వీరు చికిత్స తీసుకునేందుకు నరకం చూడాల్సిందే. ప్రమాదం జరిగితే తక్షణమే ప్లాంట్‌లో ఉన్న ప్రాథమిక చికిత్స కేంద్రంలో చికిత్స అందిస్తారు. చిన్నచిన్న గాయాలైతే స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తారు. అదే తీవ్రగాయాలైతే ఇబ్బందులు తప్పడం లేదు. ఈస్థితిలో గాయపడిన కాంట్రాక్టు కార్మికుడిని నగరంలో ఉన్న ఈఎస్ఐకు గాని, ఈఎస్ఐకు అనుబంధ ఆస్పత్రులకు తరలిస్తారు. ప్లాంట్ నుంచి నగరానికి తరలించేందుకు సుమారు గంటన్నర సమయం పడుతుంది. ఈ సమయంలో తీవ్ర గాయలపాలైన కార్మికుడు నరకం చూస్తాడు. ఇలాంటి సంఘటనలు ప్లాంట్‌లో ఎన్నో జరిగాయి. గతంలో అయితే మల్కాపురంలో ఆ స్పత్రి ఉండేది. అక్కడ కార్మికులు చికిత్స పొందేవారు. తరువాత ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికిగాను 2014లో షీలానగర్‌లో స్థలం కేటాయించారు. అయితే అక్కడ ఆస్పత్రి నిర్మాణం చేపట్టలేదు.

దీంతో దూర ప్రాంతంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లాల్సిందే. ప్రమాదం జరిగిన వెంటనే ప్రథమ చికిత్స తీసుకొని, ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు అంబులెన్స్ అందుబాటులో ఉన్నా ఆస్పత్రి మాత్రం దూరంగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి



స్టీల్‌ప్లాంట్‌తో పాటు ఇక్కడ చాలా మంది ఇతర సంస్థల్లో కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఈఎస్ఐ సేవలు పొందాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. దురదృష్టవశాత్తు అగ్ని ప్రమాదంలో చిక్కుకుంటే వైద్య సేవలు పొందాలంటే మాత్రం కాంట్రాక్టు కార్మికుడు తీవ్ర నరకం చూస్తున్నాడు. షీలానగర్‌లో త్వరితగతిన ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలి.

- కెఎఎస్ఎన్. రావు
ఉక్కు గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


సంపత్ వినాయకునికి పూజలు


అర్చకులనుంచి ఆశీర్వచనం తీసుకుంటున్న భక్తులు


ఆలయం ఎదుట బారులుతీరిన భక్తులు

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలను నగరవాసులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. వన్‌టౌన్‌లోని శ్రీ కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయం, ఆశీల్‌మెట్టలోని సంపత్ వినాయకుడి ఆలయంతోపాటు నగర పరిధిలోని పలు దేవాల యాలకు భక్తులతో కిటకిటలాడాయి.

ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఆయా ఆలయాల్లో నిర్వహించారు. రాజకీయ పార్టీ కార్యాలయాలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, ఇతర సంఘాలు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని యువతీ, యువకులు, పెద్దలు సంప్రదాయ వస్త్రధారణలో కనిపించేందుకు ఆసక్తి చూపించారు.

నెరవేరని సొంతింటి కల

... 5వ పేజీ తరువాయి

అప్పి కొండ, నడుపూరు, లంకెలపాలెం వంటి ప్రాంతాల్లో భూసేకరణ చేశారు. వీటితోపాటు సుద్దగెడ్డ, ఆదర్శ నగర్, చిలకపేట, సీహార్స్ జంక్షన్, రాజీవ్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ముత్యాలమ్మ కాలనీ, రాజీవ్ నగర్‌కాలనీ, గౌరీనగర్, ఏఎస్ఆర్ నగర్ వంటి మురికివాడలను తొలగించి అదే స్థలంలో 1,256 ఇళ్లు చొప్పున మొత్తం 31 లేఅవుట్లలో 24,192 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. వీటిలో దాదాపు నాలుగు వేల ఇళ్ల నిర్మాణం పూర్తవడంతో టీడీపీ ప్రభుత్వం 2019 మార్చిలో లబ్ధిదారులకు లాటరీ ద్వారా కేటాయించేసింది. తర్వాత జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్ల కేటాయింపును రద్దు చేసింది. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపిస్తూ, కొత్తగా మళ్లీ సర్వే చేసి గతంలో అర్హులుగా గుర్తించడంతో డీడీలు తీసిన వారిలో 13,761 మందిని అనర్హులుగా తేల్చింది. మిగిలిన 30,083 మందిని మాత్రమే అర్హులుగా తేల్చారు. వీరందరికీ సరిపడా ఇళ్ల నిర్మాణం జరగకపోవడంతో లాటరీ ద్వారా 24,192 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసింది. మిగిలిన వారికి గతంలో తీసిన డీడీలను వెనక్కి ఇవ్వడంతోపాటు ఒక సెంటు చొప్పున జగనన్న కాలనీల్లో ఒక సెంటు చొప్పున స్థలాన్ని అందజేస్తామని చెప్పింది.

ఐదేళ్లలో అడుగు ముందుకు పడని పనులు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ హయాంలో నిర్మాణం పూర్తయిన సముదాయాలకు ఉన్న రంగులను మార్చేసి వైసీపీ జెండాను పోలిన రంగులను వేయించింది. వైసీపీ అధికారం చేపట్టిన ఏడాదిలోనే నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించిన మంత్రులు గత ఐదేళ్లలో కేవలం 7,456 ఇళ్లు మాత్రమే (టీడీపీ హయాంలో చివరి దశకు చేరిన నిర్మాణాలను పూర్తిచేయడంపైనే దృష్టిపెట్టారు తప్పితే మిగిలిన నిర్మాణాలను విస్మరించారు) లబ్ధిదారులకు అప్పగించారు. వీటిలో చాలాచోట్ల కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఆయా ఇళ్లలోకి వెళ్లలేదు. దీంతో అవన్నీ ఖాళీగానే ఉండిపోయాయి. బక్కన్నపాలెంలో టిడ్కో సముదాయాలు ముళ్లపొదలతో మందుబాబులు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. చీమలాపల్లిలో మొండిగోడలతోనే నిర్మాణాలను నిలిపేయడంతో శిధిలావస్థకు చేరుకున్నాయి. ఐదేళ్లలో ఆదిగో...ఇదిగో అంటూ ఆశల పల్లకిలో ఊరేగించిన వైసీపీ నేతలు, అధికారులు ఇప్పటికీ తమకు సొంత ఇంటి కల నెరవేరకుండా చేశారంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

వైసీపీకి షాక్

... 5వ పేజీ తరువాయి

కండువా కప్పుకున్నారు. ఆయనతోపాటు 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, దుర్గాలమ్మ దేవస్థానం ధర్మకర్త బత్తి మంగరాజు, గరుడ సత్రం ధర్మకర్త చరకం మణమ్మ, 35వ వార్డు వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరీశంకర్, వర్తక సంఘం జిల్లా సభ్యులు రామిరెడ్డి, నిమ్మ శ్రీనివాస్, ముక్కు శ్రీనులు టీడీపీలో చేరారు. దక్షిణ నియోజకవర్గానికి చెందిన మరో ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు కూడా త్వరలో టీడీపీలో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. సుధాకర్‌కు ఏదైనా బాధ్యత అప్పగించిన వెంటనే తాము కూడా టీడీపీలో చేరిపోతామని దక్షిణ నియోజకవర్గానికి చెందిన వైసీపీ అసమ్మతి కార్పొరేటర్ ఒకరు తెలిపారు.

బ్లాక్‌లో మద్యం విక్రయాలు

... 5వ పేజీ తరువాయి

మందుబాబులకు తమతో ముందుగానే అవగాహన ఏర్పరచుకున్న బెల్ట్‌షాపు నిర్వాహకులు, స్నేహితుల ఫోన్ నంబర్ ఇచ్చి వారి వద్ద నుంచి కొనుక్కోవాలంటూ సలహా ఇస్తున్నారు. దీంతో మందుబాబులు వారి వద్దకు వెళ్లి సీసాకు రూ.వంద వరకూ అదనంగా చెల్లించి కొనుక్కుంటున్నారు. ప్రస్తుతం నగరంలో పలు పాన్‌షాప్‌లు, చిన్న చిన్న కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్నారు. ఎండాడలోని ఒక ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద ప్రతిరోజూ ఒక యువకుడు బైక్‌పై వచ్చి తనను సంప్రతించిన వారికి మద్యం సరఫరా చేస్తున్నాడు. ఈ విషయం ఎక్సైజ్‌శాఖ అధికారుల వద్ద ప్రస్తావించగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్యం విక్రయాలపై సీలింగ్ విధించామన్నారు. బెల్ట్ దుకాణాలపై సెబ్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

విశాఖ నుంచి బ్యాంకాక్ విమానం ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

కుమార్‌రాజా, నరేశ్‌కుమార్, వర్మ, విజయమోహన్‌లు మాట్లాడుతూ భారత కాలమానం ప్రకారం ఇది విశాఖపట్నంలో రాత్రి 11.50 గంటలకు బయలుదేరి 2.30 గంటలకు బ్యాంకాక్‌లో ల్యాండ్ అవుతుందన్నారు. అక్కడ రాత్రి 7.50 గంటలకు బయలుదేరే విమానం విశాఖపట్నంలో ఆదేరోజు రాత్రి 11.20 గంటలకు చేరుతుందని వివరించారు. ప్రయాణానికి 2.40 గంటల సమయం పడుతుందన్నారు. ఇది మంగళ, గురు, శనివారాల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఐపీఎల్‌లో లోకల్ బాయ్ నితీష్ మెరుపులు

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఏప్రిల్ 9: ఐపీఎల్ మ్యాచ్‌లో నగరానికి చెందిన నితీష్‌కుమార్‌రెడ్డి (64) మెరుపులు మెరిపించాడు. సన్ రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడుతున్న నితీష్ మంగళవారం పంజాబ్‌లోని ముల్లన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సిక్సర్లు, బౌండరీలతో చెలరేగాడు. సన్‌రైజర్స్ కేవలం 39 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన దశలో క్రీజులోకి వచ్చిన నితీష్‌కుమార్‌రెడ్డి పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. హర్‌ప్రీత్ బ్రర్ వేసిన ఒక ఓవర్‌లో రెండో బంతి బౌండరీ, మూడో బంతి సిక్సర్, నాలుగో బంతి బౌండరీ, ఐదో బంతి సిక్సర్ బాదిన నితీష్ ఆరో బంతికి రెండు పరుగులు చేసి మొత్తం 22 పరుగులు రాబట్టాడు. కేవలం 32 బంతుల్లో మూడు బౌండరీలు, ఐదు సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తిచేసిన నితీష్‌కుమార్‌రెడ్డి...వ్యక్తిగత స్కోరు 64 పరుగుల వద్ద అర్షదీప్‌సింగ్ బౌలింగ్‌లో రబడ క్యాచ్ పట్టడంతో అవుటయ్యాడు.

పొంచి ఉన్న ప్రమాదం

జగదాంబ కూడలి, ఏప్రిల్ 9: గ్రేటర్ 30 వార్డు కుమ్మరవీధి ప్రధాన రహదారి వద్ద అండర్ డ్రైనేజీ పైకప్పు పూర్తిగా మూసుకోకపోవడంతో ప్రమాదకరంగా మారింది. జీవీఎంసీ యూజీడీ విభాగం డ్రైనేజీ పైకప్పుతెరచి పనులు చేసుకొని తిరిగి పూర్తిగా మూసివేయకుండా వదిలేశారు. ఈవిషయంపై పలు మార్లు సంబంధత సిబ్బందికి తెలియజేసినా నిర్లక్ష్యంగా వదిలేశారని స్థానికులు వాపోతున్నారు. వాహదారులు అనేక సార్లు ఈ డ్రైనేజీ వద్ద ప్రమాదం బారినపడినట్టు అంటున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు ఇక్కడ ప్రమాదానికి లోనవుతున్నారు. పిల్లల ఆటలాడుకునే సమయంలో పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డు కార్పొరేటర్, వైసీపీ వార్డు స్థాయినాయకులు కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తక్షణం అధికారులు చర్యలు తీసుకొని అండర్ డ్రైనేజీ పైకప్పు సరిచేయాలని కోరుతున్నారు.


కుమ్మరవీధి ప్రధాన రహదారి మధ్యలో తెరచి ఉన్న అండర్ డ్రైనేజీ పైకప్పు

ఎండుతున్న చెరువులు

మధురవాడ, ఏప్రిల్ 9: వేసవి తీవ్రతతో మధురవాడ పరిసరాల్లోని చెరువులు ఎండి పోతున్నా యి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. ఇళ్లలో ఉన్న బోరుబావుల నుంచి అవసరం మేరకు నీరు రావడం లేదని పలువురు వాపోతున్నారు. అపార్ట్‌మెంట్‌వాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఒక వైపు వేసవిలో నీటి వినియోగం పెరగడం, మరోవైపు చెరువులు, గెడ్డలు ఎండిపోవడంతో కటకటలాడుతున్నారు. వర్షాకాలంలో నిండుగా నీటితో కళకళలాడిన శిల్పారామం చెరువులో ప్రస్తుతం చుక్కనీరు లేదు. బొట్టవానిపాలెం ఎండోడు చెరువు, నగరంపాలెం రాళ్ళచెరువులో కూడా నీరులేక బీటలువారాయి. కొన్ని చెరువులు స్థానికుల నిర్లక్ష్యం కారణంగానే ఎండిపోయాయి. డెబ్రిస్‌ని చెరువుల్లో వేయడం తో పాటు పనికిరాని వ్యర్థాలను, ప్లాస్టిక్ సామగ్రిని వేస్తుండడంతో అవి నీటిని నిల్వఉంచుకునే సామర్థ్యం కోల్పోయాయి. దీంతో మండుతున్న ఎండలకు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటాయి. ఇకనైనా అధికారులు జలవనరుల్లో పూడికలు తీయించి, సిద్ధం చేస్తే రానున్న వర్షాకాలంలో నీటితో నిండుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


చుక్కనీరులేని శిల్పారామం చెరువు

నిర్మానుష్యంగా రహదారులు



నిర్మానుష్యంగా మద్ది- పద్మనాభం రహదారి

పద్మనాభం(రూరల్), ఏప్రిల్ 9: గత కొద్ది రోజులుగా మండుతున్న ఎండలు, వడగాల్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 9 గంటలకే ఉక్కపోత మొదలుకావడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మంగళవారం ఎండ అధికంగా ఉండడంతో చిన్నాపురం, రెడ్డిపల్లి, అనంతవరం, అయినాడ, రేవిడి, పద్మనాభం, తదితర ప్రధాన జంక్షన్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

'మేనిఫెస్టోలో ఓపీఎస్ చేర్చాలి'

పద్మనాభం(రూరల్), ఏప్రిల్ 9: అన్ని రాజకీయ పార్టీలుతమ మేనిఫెస్టోల్లో ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికలకు ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టు కోలేదని, ఐదేళ్ల పోరాడినా ఫలితం దక్కలేదన్నారు. ఈ నేపథ్యంలో సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని అన్ని పార్టీలు హామీ ఇవ్వాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పద్మనాభం (రూరల్), ఏప్రిల్ 9: ఫీడరు నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. రేవిడి, బర్లపేట, పాండ్రంగి, కొండబర్లపేట, కురపల్లి, తదితర ప్రాంతల్లో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 9: వేసవి నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ వికలాంగుల సంక్షేమ విభాగం అధ్యక్షుడు చందవరపు కుమార్ కణమాం కూడలిలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. తగరపువలసలో మణికంఠ మిఠాయి దుకాణ యజమానులు మూడు కూలింగ్ చలివేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిని జోనల్ కమిషనర్. కనకమహాలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. తగరపువలస కూడలిలో రెండు, విజయనగరం బైపాస్ వద్ద ఒకటి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎ.నాగరాజు, సత్యనారాయణ, వర్తక సంఘం అధ్యక్షులు మురళి, దేముళ్లు, అప్పారావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండితులకు ఉగాది పురస్కారాలు

సింహాచలం, ఏప్రిల్ 9: క్రోధి నామ వత్సరాది ఉగాదిని పురస్కరించుకుని సింహాచల దేవస్థానం ఆధ్వర్యంలో పలువురిని ఘనంగా పురస్కారాలతో సత్కరించారు. మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణం తరువాత దేవాలయ కల్యాణమండపంలోఈఓఎస్.శ్రీనివాసమూర్తి విశ్రాంత వేద పండితులు వడలి ఆంజనేయశర్మ, విశ్రాంత ప్రధానార్చకులు గొడవర్తి కృష్ణమాచార్యులు, ప్రధాన కైంకర్యపరులు (హెడ్ కుక్) ఏవీ రాఘవాచార్యులు, పంచాంగ కర్త తెన్నేటి శ్రీనివాసశర్మ, దేవాలయ నిత్యాన్న ప్రసాద పథకానికి విరాళాలు ఇచ్చిన దాతలు ఎం.సీతారామమూర్తి, కె.కృష్ణమాచార్యులను సత్కరించి వేదాశీర్వచనాలిచ్చారు.

'డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి'

సిరిపురం, ఏప్రిల్ 9: నగర వ్యాప్తంగా ఊబర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న రేట్లు తగ్గించకూడదని, ప్లాట్‌ఫాం చార్జీలను రద్దుచేయాలని చట్ట ప్రకారం యాజమాన్యం అదనంగా కమీషన్ తీసుకోవడం ఆపాలని చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించారు. కలెక్టర్, సంబంధిత అధికారులు కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సినిమా గైడ్

- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, శారద, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-1, హెవెన్, లక్ష్మీకాంత్ (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 22, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 24, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళదుంపలు 21, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 150, బరబాటి 22, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 28, దోస కాయలు 12, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 110, పొటల్స్ 64, కీరదోస 22, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 45, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	405
విజయనగరం	409
శ్రీకాకుళం	409

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..



సింహాచలం దేవస్థానంలో పంచాగ శ్రవణం చేస్తున్న అర్చకులు



వైసీపీ జిల్లా కార్యాలయంలో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడవాడలా ఘనంగా ఉగాది వేడుకలు

క్రోధి నామ సంవత్సర తెలుగు సంవత్సరాది... ఉగాది పర్వదినాన్ని మంగళవారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచీ భక్తులు ఆలయాలకు బారులు తీరారు. సాయంత్రం ఆలయ ప్రాంగణాలు, గ్రామాల్లోని రామాలయాలు, రచ్చబండలు, ఇతర వేదికల వద్ద పంచాంగ శ్రవణాలు జరిగాయి. తమ తమ రాశుల స్థితిగతులు తెలుసుకునేందుకు జనం ఉత్సాహం చూపించారు.

సింహాచలం, ఏప్రిల్ 9: ఈ ఏడాది రాజు కుజుడు కావడంతో అధికారుల మధ్య విరోధం, అగ్ని, చోరభయం, పంటలు సరిగా పండకపోవడం, సర్పభయం, సస్యాధిపతిగా కుజుడు ఉండుటతో దుర్మార్గం ప్రబలడం, ప్రాణహాని, ప్రజా సంక్షోభం, రాజకీయ అలజడులతో సమాజం అల్లకల్లోలంగా సమాజం ఉంటుందని అప్పన్న ఆలయ పురోహితులు కరి సీతారామాచార్యులు తెలిపారు. క్రోధినామ ఉగాది పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం క్రోధినామ సంవత్సర పంచాంగ శ్రవణం గావించారు. పంచాంగం ప్రకారం సింహాద్రినాథునికి ఆదాయం 5, వ్యయం 5, రాజ్యపూజ్యం 5, అవమానం 2గా ఉందన్నారు.

పద్మనాభం (రూరల్): మండలంలోని మద్ది, అనంతవరం, రెడ్డిపల్లి, పాండ్రంగి, రేవిడి, బోని, తదితర గ్రామాల్లో మంగళవారం ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. ప్రజలు రాశి ఫలాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కార్యాలయంలో

ఎండాడ: ఎండాడలో ఉన్న వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. పంచాంగ శ్రవణం అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వరుదు కళ్యాణి, పేడాడ రమణికుమారి, రవిరెడ్డి పాల్గొన్నారు.

శిల్పారామంలో ఉగాది సంబరాలు

మధురవాడ: మధురవాడ శిల్పారామంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడిని పర్యాటకులకు పంపిణీ చేశారు. సాయంత్రం దివాకర్‌శర్మ పంచాంగశ్రవణం చేశారు. అనంతరం విజయనగరానికి చెందిన విజయ నృత్య కళాకేంద్రం కళాకారులు పలు నృత్యాలు ప్రదర్శించారు. బాబుల్ మాస్టర్, కల్పన రమణమ్మ దర్శకత్వంలో కార్యక్రమం నిర్వహించారు.

సాగర్‌నగర్: సాగర్‌నగర్ సాగరేశ్వరాలయంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు.

ఘనంగా వసంత నవరాత్రులు

భీమునిపట్నం: ఉగాది సందర్భంగా మంగళవారం వారిజ ఆశ్రమంలో పంచాంగ శ్రవణం జరిగింది. ఈ సందర్భగా 17 వ తేదీ వరకు జరిగే వసంత నవరాత్రులు ప్రారంభమయ్యాయి. లక్ష్మీ హయగ్రీవ మందిరంలో పంచాంగ శ్రవణం జరిగింది. ప్రతిరోజూ ఉదయం సుందరకాండ పారాయణం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. భీమిలి కళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో...

ఎంవీపీకాలనీ: హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. షిర్డీ సాయి ఫంక్షన్ హాలులో నారసింహ యజ్ఞం చేశారు. రాధా కృష్ణులకు అష్టోత్తర స్తోత్రంతో హరినామ సంకీర్తనలు చేశారు. డాక్టర్ నిష్కించన భక్త దాస ఆధ్వర్యంలో శ్రుతిసాగర దాస, వైకుంఠేశ్వర దాస, శ్యామమాధవ దాస తదితరులు పాల్గొన్నారని యదురాజాదాస తెలిపారు. భక్తులకు మహా ప్రసాదం వితరణ చేశారు.

ఆరిలోవ: ఉగాది సదర్భంగా పలు ఆలయాలలో వేద పడితులు పంచాగ శ్రవణం చేశారు. చినగదిలి నార్త్ షిర్డీ సాయి ఆలయంలో అర్చకులు మావుడూరు నగేష్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ట్రస్టీ వానపల్లి అప్పారావు, పాత్రో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను సత్కరించారు. సాలిపేట అభయ గణపతి ఆలయంలో అర్చకులు ధర్మప్రసాద్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు.

అష్టలక్ష్మి దేవాలయంలో...

కొమ్మాది: స్థానిక అష్టలక్ష్మి దేవాలయంలో ఉగాది వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, అర్చన, తోమాల సేవ, 132 సువర్ణ సంపెంగతో శ్రీలక్ష్మీనారాయణులకు అర్చన చేశారు.స్వామివారికి వజ్రకవచ అలంకరణలు జరిపారు. సాయంత్రం పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. ఉగాది పచ్చడిని ప్రసాదంగా అందజేశారు. పూజాకార్యక్రమాలలో ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరిన రైతులు, యువకులు

సింహాచలం, ఏప్రిల్ 9: భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు సమక్షంలో విజినిగిరిపాలెం, లండగరువు ప్రాంతాలకు చెందిన రైతులతోపాటు సింహాచలం వైసీపీకి చెందిన యువకులు మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేశారు. పంచగ్రామాల భూ సమస్య పరిష్కారానికి గంటా హామీ ఇవ్వడంతో వారంతా పార్టీ తీర్థం పుచ్చుకున్నట్టు తెలిపారు. కార్పొరేటర్ పీవీ నరసింహం, పంచదార్ల శ్రీనివాస్ సారథ్యంలో చేరిన బంధం సూరిబాబు, ఎర్ర దేవీవరప్రసాద్, పెద్దిరెడ్డి అశోక్, పి.ముత్యాలు, భోగాపురపు శ్రీనివాసరావు, సతీష్, లోగిశ పైడిబాబు, ప్రకాష్, ఉమామహేష్, కోట్ల అంజీ, పిళ్లా గుర్నాథ్‌తో పాటు సుమారు 60 మంది రైతులను గంటా పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తానని ప్రతిఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

గంటాను కలిసిన 8వ వార్డు నేతలు

ఎండాడ: భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావును పార్టీ జీవీఎంసీ 8వ వార్డు అధ్యక్షుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మంగళవారం కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. వార్డులోని పలు అంశాలను గంటా దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సహదేవ్ యాదవ్, చిన్నగోపి, ఒమ్మి బాబూరావు, బెల్లాన శ్రీనివాసరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్న గంటా

భీమునిపట్నం: భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు బుధవారం తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్‌ను ప్రకటించారు.



టీడీపీలో చేరిన రైతులు, యువకులతో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

మండలంలోని అన్నవరం శ్రీరామాలయంలో బుధవారం ఉదయం 6.30 నుంచి 7 గంటలవరకూ గంటా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం అల్పాహారం చేసి ప్రచారాన్ని ప్రారంభిస్తారు. అక్కడినుంచి నాగమయ్యపాలెం, మజ్జివలసలో ప్రచారం అనంతరం భోజన విరామం, సాయంత్రం 5 నుంచి పాతమూలకుద్దు, చిప్పాడలో ప్రచారం సాగుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ వర్గాలు కోరాయి.

సీతారాముల కల్యాణోత్సవానికి ఉడుపురాట



ఉడుపురాట వేస్తున్న అర్చకులు,గ్రామస్థులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 9: పాతవెంకోజిపాలెం సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాలు మంగవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో గ్రామస్థులు కల్యాణరాట వేశారు. సంఘం అధ్యక్షులు ఆడారి పరదేశి, అర్చకులు రంపారామ్మోహన్‌శర్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. హనుమత్ సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలతోపాటు సాయి ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానాలు చేయించారు. పంచామృతాభిషేకాలు అనంతరం జలాభిషేకం చేశారు. తొమ్మిది రోజులు ఉత్సవం జరుగుతుందని ఆలయ అధ్యక్షుడు ఆడారి పరదేశి తెలిపారు. 17న శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీవీఎస్ సుబ్బరాజు దంపతులు, పీల వెంకట పరదేశినాయుడు, శ్రీనివాసరావు నాగరాజు, శివప్రకాష్, త్రినాథ్, రఘు, సురేష్, కనకరాజు, శ్రీను, రవికుమార్ పాల్గొన్నారు. కొత్త వెంకోజిపాలెం సీతారాముల ఆలయం, ఇసుకతోట రామాలయం, ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వెంకటేశ్వరాలయంలోనూ కల్యాణ రాటోత్సవం నిర్వహించారు.

పోలమాంబ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

» సీతమ్మధార తహసీల్దార్ శ్రీరామమూర్తి



సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్, ఈవో, ఇతర అధికారులు

పెదవాల్తేరు, ఏప్రిల్ 9: పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేయనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.గాయత్రి, సీతమ్మధార తహసీల్దార్ శ్రీరామమూర్తి తెలిపారు. అమ్మవారి ఆలయ ఆవరణలో తహసీల్దార్ అధ్యక్షతన అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అమ్మ వారి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడానికి అన్ని విభాగాల అధికారులు సహకరించాలని ఈవో కోరారు. ఈ నెల 14 నుంచి మే 14 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 14న పండగ చాటింపు, 15న పందిరి రాట మహోత్సవం, 15న దేవరపండగ (పుట్టబంగారం తెచ్చుట) 22న తొలేళ్ల నిర్వహిస్తామన్నారు. ఈ నెల 23వ తేదీన అనుపు ఉత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 30న మారువారం పండగ, మే 4న మహా అన్నదానం జరుగుతుందన్నారు. సమావేశంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, జోన్-1 ట్రాఫిక్ ఏసీపీ, జీవీఎంసీ, విద్యుత్, అగ్నిమాపక శాఖాధికారులు, గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నూకాలమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



పొట్నూరులో అమ్మవారి దర్శనానికి భక్తులు

భీమునిపట్నం, ఏప్రిల్ 9: భీమిలి గ్రామదేవత నూకాలమ్మవారిని ఉగాది సందర్భంగా మంగళవారం వేలాది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు మురళీమోహన్, కీర్తి శ్రీనివాసరావు భక్తులకు తాగునీరు, చిన్నారులకు బిస్కెట్లు, పాలు పంపిణీ చేశారు. సీఐ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, గంటస్తంభం వద్ద కనక దుర్గ మోటార్ వర్కర్స్ ఆధ్వర్యంలో పులిహోర, పంపిణీ చేశారు. వేములవలసకు చెందిన జి 1 హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పొట్నూరులో జాతర

పద్మనాభం: మండలంలోని పొట్నూరు నూకాలమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తీర్థం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా పద్మనాభం కుంతీమాధవ దేవాలయంలో ఉగాది సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు.



భీమిలి నూకాలమ్మ ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు



గరుడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

సింహాచలేశుడికి వైభవోపేతంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఏప్రిల్ 9: వరాహలక్ష్మీనృసింహ స్వామికి వైభవంగా పలు ఆర్జిత సేవలు జరిగాయి. వాటిలో భాగంగా మంగళవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచి ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి తొలుత నృసింహ సహస్రనామావళితో తులసీ దళార్చన జరిపారు. తరువాత రజిత గరుడ వాహనంపై స్వామిని ఉంచి గరుడసేవను చేశారు. అనంతరం ఉదయం 9.30గంటలకు ఆర్జిత నిత్యకల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చి, భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మరోసారి అవకాశం ఇవ్వండి: వెలగపూడి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 9: నాలుగోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఓటర్లను కోరారు. ఆయన మంగళవారం ఎంవీపీ కాలనీ ఒకటో సెక్టరులో ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

'వెలగపూడిని గెలిపించాలి'

వెంకోజీపాలెం, ఏప్రిల్ 9: తూర్పు టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబును గెలిపించాలని కోరుతూ 16వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నారు గోపి ఇంటింటికీ ప్రచారం చేశారు. బాబు ష్యూరిటీ... భవిష్యత్తు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ముగడ వాసు, బంగార్రాజు, మొల్లి శంకర్, పల్లా ఉమారాణి, మొల్లి శోభ, జి.అప్పన్న, ఆర్.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం



సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ మహిళా నేతలు

సాగర్‌నగర్, ఏప్రిల్ 9: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని టీడీపీ నాయకురాలు శతపతి మంగాదేవి అన్నారు. మంగళవారం 200 మంది మహిళలతో సుభాష్‌నగర్‌లోని ఇంటింటికీ వెళ్లి ఈ పథకాలపై ప్రచారం చేశారు. చెట్టుపల్లి గోపి సారథ్యంలో కేదారిలక్ష్మి , పుష్పలత, బి.దొరబాబు, సన్యాసిరావు తదితర తదితరులు పాల్గొన్నారు.

నారసింహుని సన్నిధిలో సూర్యకిరణాలు



ఆలయంలోకి ప్రసరిస్తున్న సూర్యకిరణాలు

సింహాచలం, ఏప్రిల్ 9: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయ సన్నిధిలో ఉగాది పర్వదినాన ప్రత్యక్ష దైవం సూర్యనారాయణుని కిరణాలు తాకే దృశ్యం ఆవిష్కృతమైంది. దేవాలయ నిర్మాణ కౌశల్యం కారణంగా ఏటా ఉగాది పర్వదినాన సూర్యాస్తమయ సమయాన సూర్యకిరణాలు అప్పన్నస్వామి అంతరాలయంలోకి వెళ్తాయి. ఈ అపురూప ఘట్టానికి మూడేళ్లుగా వాతావరణ ప్రతికూల పరిస్థితులతో భక్తులు దూరమయ్యారు. ఈ ఏడాది మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణం ముగిసిన తరువాత గురుడమండపం మీదుగా ధ్వస్తంభం దాటి ఆస్థాన మండపం, నీలాద్రిగుమ్మం, భోగమండపాలు దాటి అంతరాలయంలోని అప్పన్నస్వామి సన్నిధికి సూర్యకిరణాలు చేరుకున్నాయి. ఆ దృశ్యాన్ని తిలకించిన భక్తులు ఆనంద పరవశులయ్యారు.

వైభవంగా అప్పన్న తిరువీధి



మాడవీధులో స్వామివారి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం, ఏప్రిల్ 9: ఉగాది పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అలంకారి కరి సీతారామాచార్యులు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో అధిష్ఠింపజేశారు. కోలాట కళాకారులు నృత్యాలు చేస్తుండగా ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేద పఠనాల నడుమ, భక్తుల హరినామ స్మరణలతో స్వామివారి తిరువీధి మాడవీధుల్లో సాగింది. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలిచ్చి స్వాగతించారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



సాయి వ్రతాలలో పాల్గొన్న భక్తులు

ఆరిలోవ, ఏప్రిల్ 9: ఆదర్శనగర్ షిర్డీ సాయి బాబా ఆలయం 26 వవార్షికోత్సవంలో భాగంగా మంగళవారం సామూహిక సాయి వ్రతాలు నిర్వహించారు. ముందుగా లక్ష్మీగణపతి హోమం, అనంతరం బాబాకు అన్నాభిషేకం చేశారు. ఆలయ అధ్యక్షుడు బండి గోవిందరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి.

వెంకన్నకు వెండి నందకం బహూకరణ



స్వామివారికి వెండి నందకం బహూకరిస్తున్న దృశ్యం

భీమునిపట్నం, ఏప్రిల్ 9: కృష్ణాకాలనీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారికి మంగళవారం పట్టణ ప్రముఖులు, ఆలయ సంక్షేమ సంఘం కోశాధికారి ముమ్మిడిశెట్టి సత్యానందం వెండి నందకాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ముమ్మిడిశెట్టి ఆదిత్య దంపతులు, బొండా బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.